
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మెదక్
20
గురువారం 31 ఆగస్టు 2017





టేక్మాల్ మండలంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్



సోలార్ కంపెనీ పేరిట జీపీఏ చేసిన ప్రాంతంలోఉన్న ఆలయం

దాచేస్తే దాగదులే!

- సోలార్ భూముల్లో అక్రమాలు లేవంటూ ఉన్నతాధికారులకు నివేదిక
- గుట్టుచప్పుడు కాకుండా రికార్డులను దిద్దిన టేక్మాల్ అధికారులు
- ఆధారాలతో ఫిర్యాదు చేసినా సూత్రధారులపై చర్యలు కరువు
- ఆర్డీవో ప్రత్యేకాధికారిగా ఉన్నా.. సాగని భూముల విచారణ
- ప్లాంట్ల భూములపై ఊసే లేని ప్రత్యేక సమావేశం
- దీర్ఘకాలిక సెలవులో తహసీల్దార్

చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికి.. దాన్నే ఒప్పని ఎదుటివాళ్లను నమ్మించేందుకు మసిబూసి మారేడుకాయను చేస్తున్నారు. ఆ తప్పును సరిదిద్దాల్సిందిపోయి దాచాలని చూస్తున్నారు. ఎంత దాచినా నిజాలు బయటికొస్తాయని మాత్రం మరిచిపోతున్నారు కొందరు అధికారులు. సోలార్ భూముల్లో అక్రమాలు జరిగాయి.. ఇవిగో సాక్షాలని 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు ప్రచురించింది. అధికారులు మాత్రం అవి తప్పుడు కథనాలంటూ ఉన్నతాధికారులనే బోల్తా కొట్టించారు. ఇదే అంశం ప్రజాప్రతినిధులు, అధికారులనడిగితే విచారణ జరుగుతోందని సమాధానమిచ్చారు. అంతలోనే తప్పు లేదంటూనే.. గుట్టుచప్పుడు కాకుండా రికార్డుల్లో సరిదిద్దారు. అక్రమాలకు బాధ్యులైన వారిపై మాత్రం చర్యలు తీసుకునేందుకు అధికారులకు చేతులు రావడం లేదు.

4



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ భారతిహోళికెరి

ఇంకొన్ని రోజులు పనియ్యండమ్మా?

- వానల్లేక పనులు దొరుకుతలేవు
- ఉపాధి పనిదినాలను పెంచండి
- కలెక్టర్‌ను వేడుకున్న కూలీలు

4లో

బల్దియాలో హద్దుల పంచాయితీ

- ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఒకటో వార్డు కౌన్సిలర్ మండిపాటు
- కుక్కలు, పందులు, దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్
- మార్చి 30లోగా మిషన్ భగీరథ పనులను పూర్తి చేయాలి
- మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

5

స్వచ్ఛ మున్సిపాలిటీ కల సాకారం

- ఓడీఎఫ్ మున్సిపాలిటీగా మెదక్
- ఆగస్టు 26తో ముగిసిన చివరి అవకాశం
- 3వేలకు పైగా నిర్మాణాలను పూర్తి చేయించిన అధికారులు
- రూ.70 లక్షలకు పైగా నిధుల చెల్లింపు
- వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి

5



9వ వార్డులో మరుగుదొడ్డి పనులను పూర్తి చేయించిన అధికారులు

ఇంటర్వ్యూ



గడువులోగా గొర్రెల పంపిణీ పూర్తి చేస్తాం

● జిల్లా పశువైద్యాధికారి అశోక్‌కుమార్

మెదక్ రూరల్ : జిల్లాలో గొర్రెల పంపిణీ గడువులోగా పూర్తి చేస్తామని, ఇప్పటి వరకు 20 శాతం పంపిణీ చేశామని, వచ్చే మార్చి నాటికి లక్ష్యం మేరకు లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ అందజేస్తామని జిల్లా పశువైద్యాధికారి అశోక్ కుమార్ 'ఆంధ్ర జ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

జిల్లాలో ఎన్ని గొర్రెల యూనిట్లు ఉన్నాయి ?

జిల్లాలో 1,0140 గొర్రెల యూనిట్లను ఈ సంవత్సరం పంపిణి చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 2,050 యూనిట్ల పంపిణీ పూర్తి యింది. మిగతా వాటిని కూడా అనుకున్న గడువు వరకు అందజేస్తాం.

లబ్ధిదారులకు అందించడంలో ఆలస్యం జరుగుతుంది కదా ?

గొర్రెల పంపిణీలో ఎలాంటి ఆలస్యం జరగడంలేదు. డిసెంబర్ వరకు గడువు అని భావిస్తున్నారు. వచ్చే సంవత్సరం మార్చి వరకు పంపిణీ చేయాల్సి ఉంది. ఇంకా సమయం ఉండడం వల్ల నిర్ధేశించిన గడువు వరకు లబ్ధిదారులకు యూనిట్లను అంద జేస్తాం.

రీ సైక్లింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ?

గొర్రెలను లబ్ధిదారులకు అందించడంలో పక్కా నిబంధనలను అమలు చేస్తున్నాం. మండలస్థాయి అధికారుల సమక్షంలోనే కొనుగోలు చేసి అందజేస్తున్నాం. కొన్ని సంఘటనల వల్ల ఈ ఆరోపణలు పుడుతున్నాయి. జిల్లాలో ఎక్కడ అక్రమాలకు తావు లేకుండా పంపిణి చేస్తున్నాం.

జిల్లాలో పశువైద్యుల కొరత ఉంది కదా ?

గతంలోనే ప్రభుత్వానికి ఖాళీలపై నివేదిక అందజేశాం. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్‌సీ ద్వారా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే అందులోంచి మెదక్ జిల్లాకు 20 మంది పశువైద్యాధికారులను నియమించనుంది. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులుభర్తీ అవుతాయి.

జిల్లాలో వెటర్నరీ మొబైల్ వాహనాలు ఎన్ని ఉన్నాయి ?

జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు రెండు వెటర్నరీ మొబైల్ వాహనాలు మంజూరయ్యాయి. త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ఈ వాహనాలు పశువులకు వైద్యం అందించనున్నాయి.



సిద్దిపేటలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు.. ..కార్మికులు చిత్తు

● అందని కనీస వేతనాలు

● సతమతమవుతున్న కార్మికులు

సిద్దిపేట టౌన్ : కనీస వేతనాలు లేకపోవడంతో విద్యుత్ శాఖలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కార్మికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనేక సార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినప్పటికీ వారిని పట్టించుకోవడం లేదు. 24 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో వారు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేశారు. కానీ ట్రాన్స్‌పార్మర్లను మరమ్మతు చేస్తున్నా కార్మికులను మాత్రం పట్టించుకోకపోవడంతో వారు ఇటీవలే సమ్మెకు దిగారు. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన సమ్మె 22 వరకు సాగింది.

సిద్దిపేట జిల్లాలో ఆరు మరమ్మతు షెడ్లు

జిల్లాలో 6 విద్యుత్ మరమ్మతు షెడ్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 16 ఉండేవి. సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, బెజ్జంకి, తొక్కాపూర్, ముస్త్యాలా, ముస్తాబాద్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు సెంటర్లున్నాయి. ఈ 6 షెడ్లలో సుమారు 70 మంది విద్యుత్ మరమ్మతు కార్మికులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం సూపర్‌వైజర్‌కు రూ.8000 చెల్లిస్తున్నారు. ఎల్‌వీ వైండింగ్ చేసే కార్మికులుకు, హెవీ వైండింగ్ చేసే వారికి రూ.7500, అసెంబ్లింగ్ కార్మికులకు రూ.6500, ట్యాగింగ్ చేసే కార్మికులకు రూ.5000, హెల్పర్లకు రూ.4500 చెల్లిస్తున్నారు. గతంలో వీరికి రూ.5000 మాత్రమే చెల్లించేవారు. దీంతో కార్మికులు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు.

డిమాండ్లు

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలను కల్పించాలి
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- కాంట్రాక్ట్ పద్ధతిని వెంటనే తొలగించాలి
- పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలి
- క్యాజువల్ లీవులను ఇవ్వాలి
- సమ్మె కాలంలో జీతాన్ని చెల్లించాలి



రెండు నెలల్లో సమస్యను పరిష్కరించాలి

రెండు నెలల్లో సమస్యను పరిష్కరించకపోతే మళ్లీ సమ్మెకు దిగుతాం. సీఎండీ ప్రభాకర్ సారు సమ్మె విరమించాలని, సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సారు చెప్పిన ప్రకారం సమ్మెను విరమించాం. పరిష్కరించకపోతే మళ్లీ సైరన్ మోగిస్తాం.

- వెంకన్న, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



పిల్లలను పెంచడం కష్టంగా ఉంది.



చాలీచాలని వేతనాలతో మా పిల్లలను పోషించుకోవడం కష్టంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మా సమస్యలపై దృష్టి సారించాలి. ఆపరేటర్లను రెగ్యులర్ చేసినట్లుగానే మమ్మల్ని రెగ్యులర్ చేయాలి. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తాం.

- నిరుడి ఎల్లం, అసెంబ్లర్

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఉద్యోగ భద్రత కల్పించాలి. వేతనాలను వెంటనే పెంచాలి. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించి మా కుటుంబాలను ఆదుకోవాలి. చాలీచాలనీ వేతనాలతో ఇళ్లు గడవడం లేదు. సీఎం కేసీఆర్ సారు మా బాధలను పట్టించుకోవాలి.

- విఠల్, వైండింగ్ కార్మికుడు

24 ఏళ్లుగా పనిచేస్తున్నాను



24 ఏళ్లగా పనిచేస్తున్నాను. మమ్మల్ని వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించకపోవడం దారుణం.

- రాజు, ట్యాగింగ్ కార్మికుడు

సెర్ప్‌లో హెచ్‌ఆర్ పాలసీని వర్తింపజేయాలి

● మండల సమాఖ్య అకౌంటెంట్ ఆపరేటర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్

ఉద్యోగపర్వం



మెదక్ అర్బన్: ఉద్యోగ భద్రత కోసం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) మండల సమాఖ్యలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనం రూ.18 వేలు చెల్లించి అందరికీ ఉద్యోగ భద్రతను కల్పించాలి. మండల సమాఖ్యలోనే పనిచేస్తున్న ఏపీఎంలు, సీసీలకు సెర్ప్ ద్వారా వేతనాలు అందుతుండగా, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, అటెండర్లకు మాత్రం మండల సమాఖ్య నుంచి జీతాలను చెల్లిస్తున్నారన్నారు. 12 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాం. సెర్ప్‌లో హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలి. ఆరోగ్య భద్రత, బీమా కల్పించడంతో పాటు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి. మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేయాలి. క్యాడర్ ఫిక్స్ చేసి జాబ్‌చార్ట్‌ను ఏర్పాటు చేసి పని ఒత్తిడిని తగ్గించాలి. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

అమ్మ వారికి కుంకుమార్చనతో సౌభాగ్యం

● చిట్కుల్ చాముండేశ్వరీ ఆలయ ప్రధాన పూజారి ప్రభాకర్‌శర్మ

భక్తి





చిలప్‌చెడ్: మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ దగ్గర మంజీర నది సమీపంలో వెలిసిన చాముండేశ్వరీ అమ్మవారి ఆలయం దక్షిణ భారతదేశంలోనే రెండో అతిపెద్ద దేవాలయంగా పేరుగాంచింది. ఈ ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన చేయడం వల్ల ఆ కుటుంబానికి ఏ కష్టం లేకుండా సుఖసంతోషాలతో ఉంటుందన్న విశ్వాసం. అందువల్ల ఈ ఆలయం ప్రత్యేకంగా కుంకుమార్చనలకు ప్రతీకగా నిలిస్తోంది. శుక్రవారం, సెలవు రోజైన ఆదివారం ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. ముఖ్యంగా శ్రావణమాసంలో ఈ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి కుంకుమార్చన చేస్తుంటారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి భక్తులు ఇక్కడకు విచ్చేస్తుంటారు. ఈ ఆలయంలో కుంకుమార్చనతో పాటు అమ్మవారికి ఒడిబియ్యం పోయడం వల్ల సిరిసంపదలు కల్గుతాయని భక్తుల నమ్మకం.



108లో ఆసుపత్రికి వెళ్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు కవిత

మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలికి పాముకాటు

రేగోడు : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలికి పాముకాటు వేసిన సంఘటన రేగోడు మండలంలోని జగిర్యాల ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. బుధవారం జగిర్యాల ఉన్నత పాఠశాలలో వంట గది లేక పాఠశాల స్టోర్‌రూం వరండాలో మధ్యాహ్న భోజనం వండుతున్నారు. నిర్వాహకురాలు కవిత వంట కట్టెలు తీస్తుండగా కాలుపై పాము కాటు వేసిందని తెలిపారు. వెంటనే కవితను రేగోడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం నారాయణఖేడ్ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. పాము కాటుకు గురైన కవితను పరిశీలించిన వైద్యాధికారి శంకర్ ఆందోళన అవసరం లేదని తెలిపారు. కాగా పాఠశాలలో పాములు సంచరిస్తున్నాయని, కిటికీలు, తలుపులు బాగు చేయించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు మల్లయ్య

హవేళిఘణాపూర్/మెదక్ రూరల్: వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన హవేళిఘణాపూర్ మండలం కొత్తపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాకి మల్లయ్య(60) మంగళవారం సాయంత్రం తన వ్యవసాయం పొలం వద్దకు వెళ్లాడు. పొలం పనులు చూసుకున్న రైతు స్టార్టర్ డబ్బా వద్దకు వెళ్లి మోటార్‌ను ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే కేకలు పెట్టడంతో అక్కడే ఉన్న ఇతర రైతులు వెళ్లే వరకు చేతికి గాయాలై పడి ఉన్నాడు. వెంటనే మల్లయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు హవేళిఘణాపూర్ ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

- కుమారుడు మృతి చెందిన నాలుగు నెలలకే ఆత్మహత్య
- విషాదంలో కుటుంబ సభ్యులు

నిజాంపేట: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మరణించిన సంఘటన నిజాంపేట మండలంలోని రజక్‌పల్లి గ్రామంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన వజ్జ మహంకాళి(60) నాలుగు నెలల క్రితం తన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నాటి నుంచి ఆరోగ్యం సరిగా లేక మనస్తాపానికి గురై తన సొంత వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరేసుకుని మరణించాడు. సమాచారం అందుకున్న నిజాంపేట ఎస్ఐ ఆంజనేయులు పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



మృతి చెందిన వజ్జ మహంకాళి

శిథిలావస్థలో ఎక్సైజ్ కార్యాలయం

- ఎస్ఐలు ఉండే గదిలోనే స్వాధీనం చేసుకున్న కల్లు సీసాలు, ఇతర సామగ్రి
- నిర్మాణానికి స్థలం కేటాయించినా నిధుల కేటాయింపులో జాప్యం
- ఇబ్బందుల నడుమ తప్పని విధులు

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక ఆధాయ వనరులు అందించే శాఖ ఎక్సైజ్ శాఖ అనేది జగమెరిగిన సత్యం. అయితే ఈ కార్యాలయాల నిర్వహణపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకు నిదర్శనమే నర్సాపూర్‌లోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం. నర్సాపూర్‌లో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పాత తహసీల్దార్ కార్యాలయం వెనుకనున్న ఓ శిథిలావస్థలోని చిన్న భవనంలో అరకొర సౌకర్యాల మధ్య కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ప్రస్తుతం సీఐకి ఓ గది, ముగ్గురు ఎస్ఐలకు ఒక గది, సిబ్బందికి మరో గది మాత్రమే ఉన్నాయి. దీంతో పలు కేసుల్లో స్వాధీనం చేసుకునే కల్లు శాంపిల్స్ బాటిళ్లు, అక్రమ మద్యం సీసాలు, ఇతర సామగ్రిని భద్ర పర్చడానికి ప్రత్యేకంగా గది లేదు. ఎక్సైజ్ ఎస్ఐలు ఉండే గదిలోనే వారు కూర్చునే పక్కనే వాటిని కూడా పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ఆ కార్యాలయంలో ఎస్ఐలను కలవడానికి ఇతరులు ఎవరైనా వెళితే కనీసం కూర్చోవాలన్నా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. పైగా ఆ భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరి వర్షం వచ్చినప్పుడు పైకప్పు నుంచి వర్షపు నీరు గదుల్లోకి వస్తోంది. దీంతో ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనన్న భయం కూడా వారిలో వ్యక్తమవుతున్నది. ఇదిలా ఉండగా ఎక్సైజ్ కేసుల్లో నిందితులను అదుపులోకి తీసుకుంటే వారిని ఉంచడానికి ప్రత్యేక గది కూడా లేకపోవడం ఈ స్టేషన్ ప్రత్యేకత.



కార్యాలయ గదిలోకి వస్తున్న వర్షం నీరు



ఎస్ఐలు ఉండే గదిలోనే స్వాధీనం చేసుకున్న కల్లు శాంపిల్ బాటిళ్లు

నిధుల మంజూరులో జాప్యం

ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం కోసం ప్రత్యేకంగా 20గుంటల స్థలాన్ని ఏడాది క్రితమే రెవెన్యూ అధికారులు కేటాయించి ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. నర్సాపూర్-హైదరాబాద్ ప్రధాన రోడ్డుకు పక్కనే సబ్‌స్టేషన్ సమీపంలో ఈ స్థలం కేటాయించారు. అయితే స్థలం కేటాయించి ఏడాది దాటుతున్నా ఎక్సైజ్ ఉన్నతాధికారులు కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించలేకపోతున్నారు. దీంతో ఆ స్థలం కూడా నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తారని ఆశిద్దాం.

గ్రామం నుంచి వాహనాలు వెళితే అభ్యంతరం లేదు

- టోల్‌ప్లాజా వాళ్లు అడ్డుకోవడమేంటి?
- ఇమాంపూర్ గ్రామస్థుల ఆందోళన

'తూప్రాన్: హైవే రోడ్డుపై టోల్‌భారం తప్పించుకోడానికి వెళుతున్న వాహనాలను అడ్డుకోవడం ఏంటని ఇమాంపూర్ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. తమ గ్రామం నుంచి వాహనాలు వెళ్లేందుకు తమకేమి అభ్యంతరం లేదని పేర్కొంటున్నారు. వాహనాలను అడ్డుకోవడాన్ని గ్రామస్థులందరూ వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన తూప్రాన్ మండలం ఇమాంపూర్ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తూప్రాన్ మండలం అల్లాపూర్ శివారులో హైవే 44మీదుగా ప్రయాణించే వాహనదారుల నుంచి టోల్ రుసూం వసూలు చేసేందుకు టోల్‌ప్లాజాను ఏర్పాటు చేశారు. దీంతో టోల్‌రుసుం తప్పించుకోడానికి భారీ వాహనాలు ఇతర మార్గాల నుంచి వెళుతున్నాయి. అందులో మండలంలోని ఇమాంపూర్ నుంచి అల్లాపూర్ మీదుగా గజ్వేల్ రోడ్డుకు చేరుకుంటాయి. ఇలా వాహనాలు వెళుతుండటంతో టోల్ కాంట్రాక్టర్‌కు భారీగా నష్టం వాటిల్లుతోంది. దీంతో కాంట్రాక్టర్ ఇరు గ్రామస్థులతో మాట్లాడి, గ్రామా అభివృద్ధికి రూ. 2.50లక్షల చెల్లించడంతో పాటు అక్కడ నుంచి వాహనాలు వెళ్లకుండా కాపలా ఉండేందుకు రోజు 10మందికి రూ.4వేలు చెల్లింపులు చేసేందుకు ఒప్పుకున్నారు. ఇమాంపూర్ గ్రామానికి ఒప్పుకున్న డబ్బులో రూ. 1.25లక్షలు చెల్లింపులు చేయగా, కొందరు కాజేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. డబ్బులు కాజేయడంపై గ్రామస్థులు కన్నెర్ర చేసి వాహనాలను అడ్డుకోవడాన్ని ప్రశ్నిస్తూ అన్ని వాహనాలు ఇమాంపూర్ మీదుగా వెళ్లేందుకు అభ్యంతరం లేదని చౌరస్తా వద్ద పెద్దఎత్తున గుమిగూడి ఆందోళన చేశారు. గతంలో టోల్ కాంట్రాక్టర్ గ్రామానికి తాగునీటి కోసం ఆర్వో ప్లాంటును ఉచితంగా అందజేయగా, ప్రస్తుతం ప్రజలకు తాగునీరును రూ.10లకు విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. ఇమాంపూర్ మీదుగా వాహనాలు వెళితే తమకు అభ్యంతరం లేదని, రోడ్డేసిందే వాహనాలు వెళ్లేందుకని, అడ్డుకోవడం ఏంటని గ్రామస్థులు ప్రశ్నించారు.



ఇమాంపూర్ రోడ్డు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

కాంగ్రెస్ మెదక్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా పిర్యానాయక్

- మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రోద్బలంతో రేగోడుకు స్థానం

రేగోడు : మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షుడిగా రేగోడు మండలంలోని పట్యాపోలం తండాకు చెందిన పిర్యానాయక్‌ను రాష్ట్ర కమిటీ నియమించింది. బుధవారం హైదరాబాద్‌లోని మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనరసింహ సమక్షంలో రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు జగన్ లాల్ నాయక్ ఎన్నిక పత్రాన్ని అందజేశారు. దామోదర్ రాజనరసింహ ప్రోద్బలంతో రేగోడుకు కాంగ్రెస్ పార్టీలో జిల్లా స్థానం దక్కిందని పలువురు అనందం వ్యక్తం చేశారు. జిల్లాలో ఎస్టీలను ఏకం చేసి పార్టీని బలోపేతం చేయాడానికి తమ వంతు కృషి చేస్తానని నూతన ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పిర్యానాయక్ అన్నారు. తన నియమానికి కృషి చేసిన దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలియజేశారు. పిర్యానాయక్ నియామకంపై కాంగ్రెస్ రేగోడు మండలాధ్యక్షుడు మున్నూరి కిషన్, ఎంపీటీసీ అనిల్‌కుమార్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు యాదగిరి ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.



జిల్లా కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడిగా పిర్యానాయక్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతిహోళికేరి

ప్రభుత్వ పథకాలు

ప్రజలకు అందేలా చూడండి

కలెక్టర్ భారతిహోళికేరి

వెల్దుర్తి: ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, లేకుంటే పని మానుకొని ఇంటి వద్దే కూర్చోవాలని కలెక్టర్ భారతిహోళికేరి హెచ్చరించారు. బుధవారం వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో హరితహారం, మరుగుదొడ్ల నిర్మాణంపై స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని, మరుగుదొడ్ల నిర్మాణాలను గ్రామాల వారీగా తెలుసుకున్నారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచా యతీ కార్యదర్శులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో కలెక్టర్ మండిపడ్డారు. ప్రభుత్వం ప్రతి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినా నిర్లక్ష్యం వహించడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేసేందుకే అందరికీ ఉద్యోగం ఇచ్చిందని, వేతనం కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. మీరేమైనా సామాజిక సేవ చేస్తున్నారా? తీసుకుంటున్న వేత నానికి సరిగ్గా పనిచేయాలని సూచించారు. సెప్టెంబర్ 10లోపు మెదక్ జిల్లాలో వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసి సంపూర్ణ పారిశుధ్య జిల్లాగా పేరు తేవాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో జిల్లా మరు గుదొడ్ల నిర్మాణంలో ఏడో స్థానంలో ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మరుగదొడ్లు నిర్మించుకునేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధు, మం డల ప్రత్యేకాధికారి ప్రదీప్‌రెడ్డి, తహశీల్దార్ రాజేశ్వర్ రావు, ఎంపీడీవో క్రిష్ణన్, ఆయా గ్రామాల సర్పంచు లు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సెక్రట రీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పారపట్టిన కలెక్టర్

మనోహరాబాద్ (తూప్రాన్): మనోహరాబాద్ మండలం చెట్లగౌరారం రిజర్వు ఫారెస్టులో బుధవారం కలెక్టర్ భారతిహోళికేరి మొక్కలు నాటి గుంతలు పూడ్చారు. స్వయంగా కలెక్టర్ పార తీసుకొని హరిత హారం పనులు చేయడంపై అధికారులు, ప్రజల్లో ఉత్సాహాన్ని నింపాయి.

ఉపాధి పనిదినాలు పెంచాలని వినతి

తూప్రాన్: అమ్మ కరువొచ్చింది. పనులు దొరకడం లేదు. ఇప్పటికే వంద రోజుల పని చేశాం. ఇంకొన్ని రోజులు పనియ్యండమ్మ.. అంటు కలెక్టర్ భారతిహోళికేరిని ఉపాధి కూలీలు వేడుకున్నారు. బుధవారం మనోహరాబాద్ మండల పర్యటనలో ఉన్న కలెక్టర్‌ను ఉపాధి కూలీలు కలసి పని కల్పించాలని కోరారు. స్పందించిన ఆమె పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించామని అనుమతి వస్తే పనులు కల్పిస్తామని పేర్కొన్నారు.

దాచేసినా దాగదులే..!

- సోలార్ భూముల్లో అక్రమాలు లేవంటూ ఉన్నతాధికారులకు నివేదిక
- గుట్టుచప్పుడు కాకుండా రికార్డులను దిద్దిన టేక్మాల్ అధికారులు
- ఆధారాలతో ఫిర్యాదు చేసినా సూత్రధారులపై చర్యలు కరువు
- ఆర్డీవో ప్రత్యేకాధికారిగా ఉన్నా సాగని భూముల విచారణ
- ప్లాంట్ల భూములపై ఊసే లేని ప్రత్యేక సమావేశం
- దీర్ఘకాలిక సెలవులో తహసీల్దార్

ఆంధ్రజ్యోతి, మెదక్: అక్రమం జరిగిందని ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. 'ఆంధ్రజ్యోతి' వాటిని వెలుగులోకి తెస్తే తప్పుడు కథనం అంటూ ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. పత్రిక వెలుగులోకి తెచ్చిన అంశాలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీస్తే.. విచారణ జరుగుతోంది.. అది పూర్తవగానే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివరాలు బహిరంగ పరుస్తామని హామీ ఇచ్చారు. అంతలోనే తప్పు లేదంటూ గుట్టుచప్పుడు కాకుండా రికార్డులను దిద్దారు. అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలకు చేతులు రావడం లేదు. పోనీ ఇచ్చిన మాట ప్రకారం సమావేశం నిర్వహించి వాస్తవాలు వెల్లడి చేశారా అంటే అదీ లేదు. రోజులు గడుస్తున్నాయే తప్ప హామీ నెరవేరడం లేదు. ప్రకటన చేసిన అధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. సాక్షాత్తూ ఆర్డీవో ప్రత్యే కాధికారిగా ఉన్నా సోలార్ భూముల విచారణ ముందుకు సాగడంలేదు. ప్రభుత్వ భూములను కాపాడాలంటూ ప్రజలు, ప్రజాప్రతినిధులు చేస్తున్న వినతులు చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందంగా మారింది.

నాడు జరిగింది ఇదీ...

టేక్మాల్ మండలంలో రెండు సోలార్ కంపెనీలు 50మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం మండలంలో వందలాది ఎకరాలు సేకరించారు. అయితే ప్లాంట్ ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపణలున్నాయి. అసైన్డ్, ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కొనుగోలు చేశారని ఫిర్యాదులున్నాయి. ధనూర గ్రామ సర్వే నెంబర్ 562లో 7.21 ఎకరాల ఖరీజ్‌ఖాతా భూమి ఉంది. ఇందులో 3.32ఎకరాల్లో గుట్టతో పాటు ఆ గుట్టపై వెంకటేశ్వర ఆలయం, మరో 3.39 ఎకరాల భూమి బోయిని వెంకటయ్య పేరిట పట్టా ఉంది. 7.21 ఎకరాలుగా ఉన్న భూమిని కొందరు వ్యక్తులు బైనంబర్లు సృష్టించి రికార్డుల్లో 15ఎకరాలకు పెంచారు. ఈ సర్వే నెంబర్‌లో 2011-12లో ముగ్గిరి పేరిట 7.21 ఎకరాలు ఉండగా.. 2015-16 వచ్చేసరికి ఆరుగురి పేరుపై 15.03 ఎకరాలకు పెంచేశారు. వెంకటేశ్వర ఆలయం ఉన్న ప్రాంతంతో పాటు 562 సర్వే నెంబర్‌లో ఉన్నట్లుగా చెబుతున్న 15 ఎకరాలను సోలార్ కంపెనీ పేరిట అగ్రిమెంట్ సేల్ కమ్ జీపీఏ చేసేశారు. పులి హన్మంత్, పులి సత్యనారాయణకు స్టెర్లింగ్ అండ్ విల్సన్‌కు మధ్య జీపీఏ ఒప్పందం కుదిరింది.



ప్రస్తుతం రికార్డుల్లో ప్రభుత్వ భూమి వివరాలు

ఖారీజ్‌ఖాతాగా పేర్కొన్న ఈ భూమి అమ్మడం, కొనడం నిషేధం అంటూ టేక్మాల్ మండల రెవెన్యూ అధికారులే గత ఫిబ్రవరిలో సమాచార హక్కు చట్టం కింద దాఖలైన దరఖాస్తుకు సమాధానం ఇచ్చారు. బోయిని వెంకటయ్య పేరిట ఉన్న 3.39 ఎకరాల భూమి ఎలా పదిహేను ఎకరాలుగా మారింది. ఏ విధంగా ఇతర వ్యక్తుల పేర్ల మీదకు మారిందో తెలపడంతో పాటు ప్రభుత్వ భూమిని జీపీఏ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు స్థానికులు తహశీల్దార్‌తో పాటు ఆర్డీవో, జిల్లా సంయుక్త కలెక్టర్, కలెక్టర్‌కు పలుమార్లు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు స్పందించలేదు. ఈ అక్రమతంతుపై గత మే 22న ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో 'గుడి నే అమ్మేశారు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. ఇన్‌చార్జి తహశీల్దార్‌గా ఉన్న ప్రదీప్ నివేదిక రూపొందించి కలెక్టర్‌కు పంపారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన గుడినే అమ్మేశారు కథనం పూర్తి వాస్తవ విరుద్ధమని, అక్రమాలు జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని అందులో పేర్కొన్నారు. సదరు అధికారి వచ్చిన తప్పుడు నివేదికను ఎత్తిచూపుతూ ఆంధ్రజ్యోతి 'దేవుడికే శఠగోపం' శీర్షికన కథనం ప్రచురించింది.

అక్రమం కాకపోతే మరి దీన్నేమంటారు..?

ఇంత వరకు బాగానే ఉంది. అసలు తప్పే జరగనప్పుడు అధికారులు రికార్డులు దిద్దాల్సిన అవసరం ఉండదు. ఓ వైపు అక్రమాలు లేవంటూ పైకి చెబుతున్నా.. లోలోన గుట్టుచప్పుడు కాకుండా వాటిని సరిదిద్దే పనిలో పడ్డారు రెవెన్యూ అధికారులు. కాని బాధ్యులపై మాత్రం చర్యలకు వెనుకంజవేస్తున్నారు. సర్వే నెంబర్ 562లో బైనంబర్లు సృష్టించి లేని భూమిని ఉన్నట్లుగా చూపి సోలార్ కంపెనీ పేరిట జీపీఏ చేశారు. ఎవరు అక్రమాలకు పాల్పడ్డారన్న సంగతిని తేల్చి, ఏకంగా ఆలయాన్ని అమ్మేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్న విషయాన్ని అధికారులు మర్చిపోయారు. కాని గుట్టుచప్పుడు కాకుండా రికార్డులను దిద్దారు. రెండు నెలల క్రితం వరకు ఆరుగురి పేరిట 15 ఎకరాల భూమి ఉన్నట్లు ప్రభుత్వ రికార్డుల్లో చూపించగా.. కొద్దిరోజుల క్రితం దానిని మార్చారు. సర్వే నెంబర్ 562 లో 7.2 ఎకరాల భూమి మాత్రమే ఉందని అప్పటివరకు ఉన్న ఆరుగురి పేర్లను తొలగించి ప్రభుత్వ భూమి పేరిట రికార్డులు మార్పు చేశారు. ప్రస్తుతం ఆన్‌లైన్ పహాణీ పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. సరే రికార్డులు అయితే సరిదిద్దారు మరి.. లేని భూమిని ఉన్నట్లు సృష్టించిందెవరు.. వెంకటేశ్వరుడి ఆలయం ఉన్న గుట్టతో సహా అసైన్డ్ భూమిని కంపెనీకి జీపీఏ ఎవరు చేశారో వారిని మాత్రం వదిలేశారు. మరి గతంలో ఎలాంటి అక్రమం లేదని మండల అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినప్పుడు ఇప్పుడు.. రికార్డులు మార్చాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందన్నది అధికారులకే తెలియాలి.

ప్రత్యేక సమావేశం ఊసేదీ?

సోలార్ భూముల అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు పెద్దఎత్తున స్పందన వచ్చింది. గత మే 26న టేక్మాల్ మండల పరిషత్ సర్వసభ్య సమా వేశంలో జడ్పీటీసీ ముక్తార్ సహా పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఈ అంశాన్ని లేవనెత్తారు. కబ్జాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ అధికారులను నిలదీశారు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. 15 రోజుల్లో ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి సోలార్ ప్లాంట్లకు సంబంధించిన భూముల వివరాలను వెల్లడిస్తామని తహశీల్దార్ ముజఫర్‌హుస్సేన్ హామీ ఇవ్వడంతో ప్రజాప్రతి నిధులు ఆందోళన విరమించారు. ఇది జరిగి మూడు నెలలు గడిచినా ఇప్పటికీ ప్రత్యేక సమావేశం సంగతి ఊసే ఎత్తడం లేదు. తహశీల్దార్ ముజఫర్‌హుస్సేన్ ప్రస్తుతం దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఈ నెల 23న మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సారి మండల ప్రత్యేకాధికారిగా ఉన్న మెదక్ ఆర్డీవో నగేష్ సమావేశానికి హాజరయ్యారు. ఆర్డీవోపై మండల ప్రజాప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. అక్రమాలను ఎందుకు ఉపేక్షిస్తున్నారంటూ నిలదీశారు. కాని ఈ విషయంలో అధికారుల వైపు నుంచి సమాధానం కరువైంది. ప్రతి సమావేశంలో ఆందో ళన వ్యక్తం చేస్తున్నా పట్టనట్లు సమాధానం చెప్పడం లేదు. భూములపై విచారణ ఎంతవరకు వచ్చిందో చెప్పేవారే కరువయ్యారు. పలువురు స్థానికులు సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరినా.. వివిధ కారణాలను సాకుగా చూపుతూ అధికారులు దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. భూముల వ్యవహారంపై రగడ జరుగుతున్నా ఉన్నతాధికారులు సైతం ఎందుకు పట్టించుకోవడం లేదో సామాన్యులకు అర్థం కాని భేతాళ ప్రశ్న.

ప్రజలు భాగస్వాములైతేనే గ్రామాల అభివృద్ధి

- నాణ్యమైన విద్య, కాలుష్యం లేని వాతావరణమే పిల్లలకు ఆస్తిపాస్తులు
- కలెక్టర్ భారతి హోళికేరి

తూప్రాన్: అధికారులతో ప్రజలు భాగస్వాము లైతేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ భారతిహోళికేరి అన్నారు. పల్లెపల్లెన పాలన ఉండాలని, ప్రజలే పాలించుకోవాలని ఆమె పేర్కొన్నారు. జీడిపల్లిలో ప్రజా పాలన సాగుతున్నట్లుగా ఉందని, చాలా ఆనందంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం మనోహరాబాద్ మండలం జీడిపల్లిలో నిర్వహించిన హరితహారంలో తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. వైకుంఠధామంలో, ఎవెన్యూ ప్లాంటేషన్‌లో కలెక్టర్, ఎలక్షన్‌రెడ్డి, సర్పంచ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె ప్రసంగిస్తూ జిల్లాలో 1.30 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వర్షాలు సరిగ్గా పడకపోవ డంతో పనులు జరగలేదన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతు న్నందున మొక్కలు నాటే కార్యక్రమం వేగం పుంజుకుందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 80లక్ష ల మొక్కలు నాటినట్లు చెప్పారు. రోజుకు లక్ష మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. మనోహరాబాద్ మండలంలో బుధవా రం ఒక్క రోజే 1.21 లక్షల మొక్కలు నాటినట్లు కలెక్టర్ తెలిపారు. కష్టపడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ, హరిత తెలంగాణ, ఆకుపచ్చ తెలంగాణగా మార్చుకుందామన్నారు. మొక్కల నాటడంపై ఉన్న శ్రద్ధ వాటిని సంరక్షించడానికి రెట్టింపు ఉత్సాహంతో కృషి చేయాలన్నారు. వాతావరణ కాలుష్యం తగ్గడానికి, వర్షాలు పెరగడానికి చెట్లు కావాలన్నారు. ఆడవుల్లో చెట్లు లేకపోవడంతో జంతువులు బయటకొచ్చి పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. మనం మళ్లీ మొక్కలు పెంచి వాటిని ఆడవుల్లోకి పంపేందుకు కృషి చేద్దామన్నారు. మన పిల్లలకు ఆస్తులు సంపాదించి ఇస్తున్నామని, వారికియ్యాల్సిందీ నాణ్యమైన విద్య, కాలుష్యంలేని వాతావారణమే అన్నారు. హరితహారం చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అభినందించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలన్నారు. జిల్లాలో అందరు జీడిపల్లిలాగా ఉంటే స్వర్గంలో ఉన్నట్లుగా ఉంటుం దని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ రాగం పుష్పరాణి, ఆర్డీవో ఓజే మధు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి కోటాజీ, జడ్పీటీసీ సుమన విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీశైలంగౌడ్, ఎంపీటీసీ లక్ష్మీనర్సింలుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ర్యాకల శేఖర్‌గౌడ్, ఎంపీడీపీ శ్రీనివాస్‌రావు, తహసీల్దారు నజీబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



జీడిపల్లి సభలో ప్రసంగిస్తున్న కలెక్టర్

ఉమ్మడి మెదక్ జిల్లాలో 50 మంది వీఆర్వోలకు పదోన్నతలు

జారీ కాని బదిలీ ఉత్తర్వులు

తూప్రాన్: ఉమ్మడి మెదక్ జిల్లాలో పని చేస్తున్న 50మంది గ్రామ రెవెన్యూ అధికారులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తు ఆదేశాలు జారీ అయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 24మందికి, మెదక్ జిల్లాలో 12 మందికి, సిద్దిపేట జిల్లాలో 14మందికి పదోన్నతులు లభించాయి. మెదక్ జిల్లాకు చెందిన నర్సింహారావు(కొంగోడు), నర్సింగ్(చండి), ఎం ప్రవీణ్‌కుమార్(అల్లాపూర్), ఎస్ గంగాధర్(గవ్వలపల్లి), ఆర్ నాగరాజు(రావెల్లి), ఎం హన్మంతరెడ్డి(అక్కన్నపేట), చింతల నాగేశ్(బ్రాహ్మణపల్లి), ఎండీ రుక్మొద్దీన్(ఘనపూర్), ఏ భూపతిరావు (బండపోసాన్‌పల్లి), టీ మధుకుమార్(మాసాయిపేట), ఎన్ ప్రభాకర్ (ఆవంచ), బీ మల్లారెడ్డి(టి.మందాపూర్)కు పదోన్నతి లభించింది.

తెలంగాణ విమోచన దినోత్సవం ఎందుకు జరపరు?

- అధికారంలోకి రాకముందు ఒకమాట.. వచ్చాక మరోమాటా?
- 2019లో తెలంగాణలో బీజేపీదే అధికారం
- పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్‌రావు



మెదక్‌లో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

మెదక్ మున్సిపాలిటీ: అధికారంలోకి రాకముందు రాష్ట్ర విమోచన దినోత్సవం జరపాలని ఆందోళనలు చేపట్టిన టీఆర్ఎస్ నాయకులు అధికారంలోకి వచ్చాక ఎందుకు జరపడం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్‌రావు ప్రశ్నించారు. బుధవారం స్థానిక మాయగార్డెన్‌లో నియోజకవర్గ బీజేవైఎం మిషన్ 100ప్లస్ సోషల్ మీడియా వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విమోచన దినోత్సవం కోసం ఆందోళన చేపట్టిన నాటి టీఆర్ఎస్ నాయకులు ప్రస్తుతం అధికారంలోకి వచ్చినా ఎంఐఎం పార్టీకి భయపడి జరపడంలేదని మండిపడ్డారు. ఆనాటి ఆందోళనలో పత్రికా ప్రకటనలు సాక్షాలుగా వారికి కనిపించడంలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబపాలన సాగిస్తున్నారని దుయ్య బట్టారు. ఇక కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే గ్రూపులుగా చీలిపోయి రాష్ట్రంలో కనుమరుగయిపోయిందని ఆరోపించారు. 2004 తర్వాత తెలుగుదేశంపార్టీ రాష్ట్రంలో కనుమరుగయిందని అన్నారు. 2019లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చోళ రాంచరణ్ యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నవీన్‌గౌడ్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు నవాత్ రాజ్, గడ్డం శ్రీనివాస్, నాయకులు అరుణ్, నందారెడ్డి, నల్లాల విజయ్, భాస్కర్‌రెడ్డి, అప్పాల సునిల్, గంగమోహన్, నర్సింగ్, రాహుల్, సుధాకర్ రెడ్డి, గోదల కృష్ణ, గోదల జ్యోతి, శ్రీపాల్, శివ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

మాది రైతు ప్రభుత్వం

రామాయంపేట మార్కెట్‌కమిటీ చైర్మన్ గంగ నరేందర్



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ నరేందర్

రామాయంపేట: మాది రైతు ప్రభుత్వం. అన్నదాతలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో సేవ చేస్తున్నాడని రామాయంపేట మార్కెట్‌కమిటీ చైర్మన్ గంగ నరేందర్ అన్నారు. బుధవారం పాలకవర్గ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే దాదాపు అన్ని మండలకేంద్రాల్లో ప్రభుత్వం మార్కెట్‌యార్డుల ఏర్పాటుకు కృషి చేస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించే దిశగా పనిచేస్తున్నట్లు తెలిపారు. స్థానిక కమిటీ పక్షాన కర్ణాటక, మహారాష్ట్రలో మార్కెట్‌కమిటీ అధ్యయనానికి స్టడీ టూర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హరితహారంలో భాగంగా చేగుంట, రామాయంపేట ప్రాంతాల్లో ఎక్కువగా మొక్కలు నాటించి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్న ఏఎంసీ కార్యదర్శి మల్లేషంను సన్మానించారు. రామాయంపేట సర్పంచ్‌పాతూరి ప్రభావతి, టీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అందె కొండల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టీజీవైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగరాజుగౌడ్

వెల్దుర్తి: తెలంగాణ గౌడ జన హక్కుల పోరాట సమితి, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెల్దుర్తి మండలం ధర్మారం గ్రామానికి చెందిన న్యాయవాది మేల నాగరాజుగౌడ్ ఎన్నికయ్యారు. గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సాగౌడ్, టీజీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అరవింద్‌గౌడ్ నాగరాజుగౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కల్లుగీత వృత్తి రక్షణకై ఉద్యమిస్తానని నాగరాజుగౌడ్ తెలిపారు.

స్వచ్ఛ మున్సిపాలిటీ కల సాకారం

- ఓడీఎఫ్ మున్సిపాలిటీగా మెదక్
- ఆగస్టు 26తో ముగిసిన చివరి అవకాశం
- 3వేలకుపైగా నిర్మాణాలను పూర్తి చేయించిన అధికారులు
- రూ.70 లక్షలకుపైగా నిధుల చెల్లింపు
- వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి

మెదక్ మున్సిపాలిటీ: స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ తెలంగాణ నినాదంతో ముందుకెళ్లిన మున్సిపల్ పాలకవర్గం, అధికారులు స్వచ్ఛ మున్సిపాలిటీ కలను సాకారం చేసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన స్వచ్ఛ మున్సిపాలిటీలో భాగంగా ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. 2015లో కేంద్రం స్వచ్ఛభారత్ ప్రకటించగా తెలంగాణ ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. అప్పటి నుంచి ప్రారంభమైన ఈ మరుగుదొడ్ల నిర్మాణానికి సర్వేలు, సహకారాలంటూ కొంత కాలయాపన జరిగింది. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలంటూ అధికారులకు ఆదేశాలు రావడంతో నిర్మాణాలకు అడుగులు పడ్డాయి. మరుగుదొడ్డి నిర్మించుకుంటే సహకారంగా రూ.12వేలు ప్రభుత్వమే చెల్లిస్తుందంటూ దండిగా ప్రచారం సాగించారు. అయి నప్పటికీ లబ్ధిదారులు కొంత అలసత్వం వహించారు. పూర్తిస్థాయిలో అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి వార్డుల వారీగా పర్యవేక్షించేలా చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆదేశించారు. దీంతో ఇంటింటి బాట పట్టిన అధికారుల బృందం క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి మున్సిపల్ పరిధిలోని 27 వార్డుల్లో 3,196 మరుగుదొడ్లను నిర్మించాలని నిర్ధారించారు. ఇందులో పూర్తిస్థాయిలో 2112, ఇన్‌సానిటరీ నిర్మాణాలు 1084 చేపట్టాల్సి ఉంది. కసరత్తు ప్రారంభించిన అధికారులు వార్డుల్లో పర్యటిస్తూ నిర్మాణాలు చేపట్టకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామంటూ హెచ్చరిక చేశారు. అంతా బాగానే ఉందనుకునే సమయంలో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టినా డబ్బులు చెల్లించడం లేదంటూ ప్రజలు మున్సిపల్ కార్యాలయం చుట్టూ గిరికీలు కొట్టారు. దీంతో అక్కడక్కడా కొంతవరకు నిర్మాణాలు జాప్యానికి గురయ్యాయి. ఈ క్రమంలో స్పందించిన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా మున్సిపల్‌కు చేకూరిన ఆదాయాన్ని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు చెల్లించాల్సిందిగా వెసులుబాటు కల్పించారు. దీంతో తిరిగి అధికారులు రంగంలోకి దిగి కట్టిన వెంటనే డబ్బులు చెల్లిస్తామంటూ హామీలివ్వసాగారు. ఎట్టకేలకు కొత్తగా నిర్మించాల్సిన మరుగుదొడ్లు పూర్తి చేయించారే తప్పా.. ఇన్‌శానిటరీ నిర్మాణాలు మాత్రం చేయించలేకపోయారు. ఈక్రమంలో చివరి అవకాశమంటూ పలు మార్లు ప్రభుత్వం తేదీలను వాయిదా వేస్తూ వచ్చింది. ఇదే అవకాశంగా భావించిన మున్సిపల్ అధికారులు ఇన్‌శానిటరీ నిర్మాణాలపై దృష్టి సారించారు. ఇంటింటికి తిరుగుతూ ఉన్న స్థలంలోనే ఇన్‌శానిటరీ నిర్మాణాలు చేపట్టేలా వెంట ఉంటూ కట్టించారు. కొన్ని వార్డుల్లో సహకరించకుంటే పోలీసుల పహారాలో పాత నిర్మాణాలను కూల్చివేయడమూ తప్పలేదు. దీంతో దారికొచ్చిన ప్రజలు పూర్తిస్థాయిలో ఇన్‌శానిటరీ నిర్మాణాలు చేసుకునేందుకు వచ్చారు. ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా పై నిర్మాణాలకు ఇప్పటి వరకు సుమారు రూ.70 లక్షల వరకు చెల్లించినట్లు అధికారులు తెలియజేస్తున్నారు. ఏదైతేనేమీ ప్రభుత్వం చివరి అవకాశంగా విధించిన ఆగస్టు 26లోగా వంద శాతం వ్యక్తిగత మరుగుదొడ్లు పూర్తి చేసినట్లు అధికారులు ప్రకటించారు.



ఇటీవల పూర్తి చేసుకున్న మరుగుదొడ్ల నిర్మాణం

లక్ష్యం పూర్తి చేయడం సంతోషకరం

- మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

బల్దియా పరిధిలోని 27 వార్డుల్లో 3వేలకు పైగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల లక్ష్యం చేరుకోవడం సంతోషకరం. ప్రభుత్వం ప్రకటించిన తేదీలోగా పనులు పూర్తయ్యాయి. నిధుల లేమితో కొంత జాప్యం జరుగుతున్న సమయంలో మంత్రి కేటీఆర్ ఎల్ఆర్ఎస్ పథకం నిధులు సద్వినియోగం చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారు. దీంతో లక్ష్యాన్ని చేరుకోగలిగాం.

బల్దియాలో హద్దుల పంచాయితీ

- ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఒకటో వార్డు కౌన్సిలర్ మండిపాటు
- కుక్కలు, పందులు, దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్
- మార్చి 30లోగా మిషన్ భగీరథ పనులను పూర్తి చేయాలి
- మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్



మాట్లాడుతున్న మల్లికార్జున్‌గౌడ్



వార్డు హద్దుల అంశంపై అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ అనిల్‌కుమార్

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపల్ పరిధిలో ఉన్న వార్డుల హద్దులు తెలియజేస్తూ అన్నిశాఖల అధికారులకు సర్క్యులర్ పంపించాలని సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి కౌన్సిలర్లతో పాటు అధికారులు పాల్గొన్నారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పిచ్చిమొక్కలపై గడ్డిమందు చల్లించాలని కౌన్సిలర్ చంద్రకళ, మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాలు 50 ఫీట్ల మేర నిర్మాణాలు తొలగించాల్సిందేనని 9వ వార్డు కౌన్సిలర్ మేడి మధుసూదన్‌రావు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. సీఎస్ఐ చర్చి కాంపౌండ్‌లో వీధి లైట్లు వెలగడంలేదని అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని చెప్పారు. నల్లా బిల్లులు రూ.200 నుంచి 150 కి తగ్గించాలని కౌన్సిలర్ అనిల్‌కుమార్ సభ దృష్టికి తీసుకొచ్చారు. దోమల విషయంలో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మధుసూదన్‌రావు ప్రశ్నించారు. చైర్మన్ మాట్లాడుతూ.. ఇప్పటికే 550కి పైగా కుక్కలను చంపడం జరిగిందని, పందులను కూడా పట్టణానికి దూరంగా తీసుకెళ్లాల్సిందిగా పెంపకం దారులను ఆదేశించామని తెలిపారు. దోమల విషయంలోనూ నేటి నుంచి స్పెషల్‌డ్రైవ్ ప్రారంభించాలని కమిషనర్ ప్రసాద్‌రావును ఆదేశించారు. వీటితో పాటు గణేష్ ఉత్సవాలకు ముందస్తుగానే పట్టణంలో ఏర్పడిన గుంతలను పూడ్చివేయడం జరిగిందన్నారు. అత్యవసరమైన ప్రాంతాల్లో వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీర్ చిరంజీవులకు ఆదేశించారు. మార్చి 30లోగా మిషన్‌భగీరథ పనులను పూర్తిచేసి ఇంటింటికీ నీళ్లందించేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఒకటోవార్డు కౌన్సిలర్ అనిల్‌కుమార్, ఐతారం నర్సింలు, మేడి మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. పట్టణంలో జరిగే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఆయాశాఖల అధికారులు కౌన్సిలర్లను గుర్తించడం లేదని మండిపడ్డారు. కౌన్సిలర్ అనిల్ మాట్లాడుతూ.. తన వార్డు పరిధిలో జరిగే పనులకు తనకు సమాచారం ఇవ్వడంలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ప్రకారం నా వార్డు పరిధిలో జరిగే పనులకు మరొకరు హాజరుకావడమేంటని అస హనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు అన్ని శాఖలకు గెజిట్ వార్డుల హద్దులు పంపించాలని డిమాండ్ చేశారు. మరోసారి సమాచారం లేకుండా వస్తే కార్యక్రమాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. వైస్ చైర్మన్ రాగి అశోక్ కల్పించుకొని అధికారులు గెజిట్ ప్రకారం హద్దుల విషయం వారు చూసుకుంటారని, ఈ విషయంలో 1వ వార్డు కౌన్సిలర్ ఎందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారో అర్థం కావడంలేదని చైర్మన్‌తో అన్నారు. చైర్మన్ మాట్లాడుతూ వార్డుల వారీగా ఉన్న గెజిట్‌లను అన్ని శాఖల అధికారులకు పంపించాలని కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్లు ఆరేళ్ల గాయిత్రి, చంద్రకళ, విజయలక్ష్మి, దొంతి లక్ష్మి, జెల్ల గాయిత్రి, బట్టి సులోచన రామ్మోహన్, కేశమ్మ, అమినాబేగం, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

వందశాతం మరుగుదొడ్లు నిర్మించాలి

మెదక్ డీపీవో హనూక్

రేగోడు : గ్రామంలో వందశాతం మరుగుదొడ్లు నిర్మించి మంచి గుర్తింపు పొందాలని మెదక్ డీపీవో హనూక్ అన్నారు. బుధవారం రేగోడు మండలంలోని కొండాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లు నిర్మించుకొని వాడుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రతి కుటుంబానికి మరుగుదొడ్డి కట్టించాలని గ్రామ పంచాయతీలకు తెలిపారు. జిల్లాను సంపూర్ణ మరుగుదొడ్డిగా గుర్తింపు తేవాలని అన్నారు. వెంట ఎంపీడీవో బస్వనప్ప, సర్పంచ్ సంగమేశ్వర్, ఏపీవో ఉన్నారు.



కొండాపూర్‌లో మాట్లాడుతున్న డీపీవో

సినిమాలు

నర్సాపూర్
సాయి — జయ జానకీనాయక
శ్రీనివాస — లై

రామాయంపేట
సంతోష్ — వివిపీ 2
సాయిరామ్ — లై

పెద్దశంకరంపేట
లక్ష్మి — జయ జానకీనాయక

మెదక్
సినీమ్యాక్స్ — జయ జానకీనాయక
గంగినేని — అర్జున్‌రెడ్డి
సాగర్ — వివిపీ 2



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

రామాయంపేట: రామాయంపేట మండల విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయుల అసోసియేషన్ ఉచితనేత్ర చికిత్స శిబిరం నిర్వహించింది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారంనాటి ఈ శిబిరంలో 55 మందికి పరీక్షలు జరిపారు. సిద్దిపేట సాయికృష్ణ కంటిఆస్పత్రి వైద్యబృందంచే ఈ కంటిపరీక్షలు జరిపారు. కొందరికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్‌ఉపాధ్యాయ ఉద్యోగసంఘం అధ్యక్ష కార్యదర్శులు పెంటయ్య, పాగాల బాలనర్సయ్య, శంకర్ ఉన్నారు.

'విద్యార్థులకు రాయడం, చదవడం నేర్పించాలి'

టేక్మాల్: పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రాయడం, చదవడం, లెక్కలు నేర్పించేలా త్రీఆర్ఎస్ కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం చేపట్టిందని మండల విద్యాశాఖ అధికారి నర్సింలు అన్నారు. 60 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఫార్మా-2 ప్రాథమిక స్థాయి విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి వెనకబడిన విద్యార్థులను ముందుకు తీసుకెళ్లేందుకు విద్యనభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలకుర్తి, కుసంగి పరిధిలోని స్కూల్‌కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'మరుగుదొడ్డి ఉంటేనే రేషన్ బియ్యం'



మక్త వెంకటాపూర్ గ్రామంలో పర్యటించిన తహసీల్దార్ సింగ్

రేగోడు :ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని తహసీల్దార్ ఆర్పీ సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని మక్త వెంకటాపూర్‌లో ఇంటింటికీ వెళ్లి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని తెలిపారు. మరుగుదొడ్డి లేని కుటుంబాలకు రేషన్ బియ్యం నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

'పాత పెన్షన్ విధానం అమలు చేయాలి'



అల్లాదుర్గంలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

అల్లాదుర్గం: కేంద్రప్రభుత్వం చేసిన నూతన పెన్షన్(సీపీఎస్) విధానం సెప్టెంబరు 1నుంచి అమలు జరుగుతున్న నేపథ్యం లో రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబరు1న సామూహిక సెలవు పెట్టి నిరసన తెలియజేయాలని కోరుతూ బుధవారం అల్లాదుర్గం మండలంలోని ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కరపత్రాలను విడుదల చేశారు. సెప్టెంబరు1న తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలలో ఉద్యోగులందరూ హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు భుజంగం, జనార్ధన్, కచూర్‌రావు, కందర్ప, గోవిందు, లింగమూర్తి, నర్సింలు, సాయన్న, నరేందర్‌గౌడ్, ప్రవీణ్, నాగరాజు, శివకుమార్, నాగభూషణం, ప్రశాంత్, దివ్య, అర్చన, చంద్రకళ, తారాబాయి తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో

పెద్దశంకరంపేట : ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని మెదక్ జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ విధానం రద్దు కోసం సెప్టెంబర్ 1వ తేదిన సామూహిక సెలవుకు మద్దతుగా ఎస్టీయు నిలబడుతుందన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు నిర్వహించే నిరసనలకు ఎస్టీయూ మద్దతు ఇస్తుందని, మండల, జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులందరూసెలవు పెట్టాలని పేర్కొన్నారు.

ఆరుమాసాల్లో గోదావరి జలాలు

- **నీటి ట్యాంకు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బాబూమోహన్**
- **అల్లాదుర్గం మండలంలో సుడిగాలి పర్యటన**

అల్లాదుర్గం : తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా అల్లాదుర్గం మండలంలోని ఆయాగ్రామాల ప్రజలకు ఆరుమాసాల్లో గోదావరి జలాలతో దాహార్తిని తీరుస్తానని అందోల్ ఎమ్మెల్యే పి.బాబూమోహన్ స్పష్టం చేశారు. బుధవారం అల్లాదుర్గం మండలంలో మిషన్ భగీరథ నిర్మిస్తున్న తాగునీటి ట్యాంకుల నిర్మాణం పనులను ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాలలో ఆయన సుడిగాలి పర్యటన చేసి వీటి నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బాబూమోహన్ మాట్లాడుతు, తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొనకుండా ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వం మిషన్‌భగీరథ పథకం ద్వారా ప్రతిపల్లెకు తాగునీటిని అందించి శాశ్వత తాగునీటిసమస్య పరిష్కారం కృషి చేస్తుం దన్నారు. వీటిలో భాగంగా అల్లాదుర్గం మండలంలో 50 కిలోమీటర్ల పైప్‌లైన్, 21 తాగునీటి ట్యాంకుల నిర్మాణం కోసం 8 కోట్ల రూపాయలు వెచ్చించిందన్నారు. రానున్న వేసవికాలంనాటికి నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.బాబూమోహన్

త్వరితగతిన పనులు చేపట్టాలి

మిషన్‌భగీరథ ద్వారా చేపట్టిన ఈ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వీటి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ డిసెంబర్ వరకు పూర్తిచేయాలన్నారు. మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను ప్రారంభించారు. మండలంలోని ముస్లాపూర్ గిరిజనతండాలో ఒక మహిళా భవన్‌ను నిర్మింపచేయాలని తండావాసులు కోరగా ఈ పనుల కోసం నిధులను మంజూరు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాంగారి ఇందిరా లక్ష్మీనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు మమతా బ్రహ్మం, వట్‌పల్లి, జోగిపేట ఏఎంసీ చెర్మన్లు కమ్రుద్దీన్, డి.బి.నాగభూషణం, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుభాష్‌రావ్ దేష్‌పాండె,సిఐ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంగమేశ్వర్

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

- **ఎంపీపీ రాయిని సంగమేశ్వర్**

పెద్దశంకరంపేట : విధి నిర్వహణలో పెద్దశంకరంపేట మండల ఆయాశాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై మండల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ రాయిని సంగమేశ్వర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పేట మండల వైద్యాధికారి శంకర్‌చింతల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాలక్ష్మి విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సభాదృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి అందుబాటులో ఉండడం లేదన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభుత్వ కార్యాలయాల గురించి ప్రజాప్రతినిధులకు సకాలంలో సమాచారం ఇవ్వడం లేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. ఎంపీపీ రాయిని సంగమేశ్వర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలసి మెలసి పని చేయాలన్నారు. ఈజీఎస్ ఏపీవో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 4న పేట మండలంలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజు, ఎంపీడీవో హరిసింగ్, తహసీల్దార్ పద్మారావు, ఎంఈవో పోచయ్య, ఏవో రత్న, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమస్యల సాధనకు బీడీ కార్మికుల ధర్నా



రామాయంపేటలో ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

రామాయంపేట:అర్హులందరికీ ప్రభుత్వభృతి కల్పించాలంటూ మహిళా బీడీ కార్మికులు ఆందోళనకు దిగారు. పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంవద్ద ధర్నా చేపట్టారు. అందరికి పెన్షన్ సౌకర్యం కల్పించాలంటూ డిమాండ్ చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే కార్మికుల పక్షాన మరో పోరాటానికి సిద్ధమౌతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి హెచ్చరించారు. కాగా ధర్నా అనంతరం మహిళా కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు.

మరుగుదొడ్డి ఉంటేనే రేషన్ బియ్యం : తహసీల్దార్

రేగోడు : ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని తహసీల్దార్ ఆర్పీ సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని మక్తవెంకటాపూర్‌లో ఇంటింటికీ వెళ్లి మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని తెలిపారు. మరుగుదొడ్డి లేని కుటుంబాలకు రేషన్ బియ్యం నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

రేగోడు :నవరాత్రుల సందర్భంగా బుధవారం వినాయక మండపాలవద్ద అన్నదాన కార్యక్ర మాలు నిర్వహించారు. మండల పరిధిలోని టి.లింగంపల్లి కుర్మసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద అన్నదానం చేశారు. రేగోడుపోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడి వద్ద అన్నదానం నిర్వహించారు.



టి.లింగంపల్లిలో అన్నదానం

పెద్దశంకరంపేటలో

పెద్దశంకరంపేట :పెద్దశంకరంపేటలో గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ యూత్ బాధ్యులు తిరుమలేశం చారి, సంతోష్, సురేంద్ర, సాయి, రాజు. నరేశ్, శ్రీనివాస్ చారి, శ్రీకాంత్, సచిన్, తదితరులు పాల్గొన్నారు. కాగా పేటలోని వడ్డెర కాలనీలో ప్రతిష్టించిన వినాయకుడిని మంగళవారం రాత్రి నిమజ్జనం చేశారు.



గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుడు

పాపన్నపేటలో

పాపన్నపేట: ఛత్రపతి చిన్నారుల యూత్ విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు విశేష పూజలు అందుకున్న వినాయకుడికి బుధవారం ఆరెపల్లిలో వినాయక శోభాయాత్ర ఘనంగా కొనసాగింది. అనంతరం పురవీధుల గుండా ఊరేగింపు కొనసాగుతూ గ్రామశివారులోని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఆరెపల్లిలో వినాయక ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

టేక్మాల్‌లో

టేక్మాల్: మండలకేంద్రమైన టేక్మాల్‌లోని నాగులమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని మంగళవారం రాత్రి భజన కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక చిన్నచెరువులో నిమజ్జనం చేశారు.

'పూర్వపు స్వరూపం దెబ్బతినకుండా గ్రామాల పట్టణీకరణ'

పాపన్నపేట:గ్రామాలపూర్వవైభవం, స్వరూపం దెబ్బతినకుండా గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనతో పాటు ఆధునీకరణ, పట్టణీకరణ పెంపొందించడమే రూర్బన్ మిషన్ లక్ష్యమని ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు స్పష్టం చేశారు. గ్రామాలను పట్టణాల తరహాలో అభివృద్ధి చేసే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన రూర్బన్ మిషన్ కింద పాపన్న పేట మండలం ఎంపిక కావడంపై బుధవారం ఎంపీపీపవిత్ర అధ్యక్షతన మండలపరిషత్ కార్యాలయంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాంబాబు మాట్లాడారు.



సమావేశంలో వివరిస్తున్న రాంబాబు

నిలిచిన ఫీడర్ ఛానల్ పనులు

• ఇబ్బందుల్లో ప్రజలు





రోడ్డు విస్తరణలో కూల్చివేయడానికి తెచ్చిన ఎక్సకవేటర్(ఫైల్‌ఫొటో), స్వతహాగా కూల్చివేసుకుంటామని ఒప్పందం రాస్తున్న భవన యజమాని (ఫైల్‌ఫొటో)

నిజాంపేట: నిజాంపేట మండల కేంద్రంలోని ఫీడర్‌ఛానల్ పనుల కోసం గత సంవత్సరం నవంబర్ 22వతేదీన మంత్రి హరీశ్‌రావు, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి నేటికి 10 నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ల అలసత్వంతో పనులు వేగంగా జరగడం లేదు. ఫీడర్ ఛానల్ కోసం తీసిన గుంతల్లో నీరు నిల్వ ఉండి ప్రమాదాలు జరగడమే కాకుండా దోమలు అధికమై వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోయారు. ఫీడర్ ఛానల్ కోసం తీసిన మట్టి రోడ్డుకు అడ్డంగా పోయడంతో ఎదురెదురు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సదరు కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు.

దుకాణాల్లో గిరాకీలు తగ్గుతున్నాయి

-నరేశ్, వ్యాపారి

రెండునెలల నుంచి ఫీడర్ ఛానల్ కోసం తీసిన గుంతల వల్ల దుకాణాల్లో గిరాకీలు తగ్గుతూ ప్రమాదాలకు నెలవవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నాం.



గణపయ్యకు పూజలు చేస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

గణపయ్య ఆశీస్సులు అందరికీ ఉండాలి

• జీకేఆర్ గణేష్ మండపం వద్ద అన్నదానంలో పాల్గొన్న పాలకవర్గం

మెదక్ మున్సిపాలిటీ: బొజ్జ గణపయ్య ఆశీస్సులు అందరికీ ఉండాలని చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆకాంక్షించారు. పట్టణంలోని 9వ వార్డు జీకేఆర్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్‌తో పాటు వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్లు మేడి మధుసూదన్‌రావు, ఆరేళ్ల గాయత్రి, విజయలక్ష్మి, చంద్రకళ, జెల్ల గాయత్రి, సలాం, మాయ మల్లేశం, ఆర్‌కె శ్రీనివాస్‌లు హాజరై గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండప నిర్వాహకులు సతీష్, బాల్‌రాజు, రాములతో పాటు పురం వెంకటనారాయణ, తొడుపునూరి రాము, కొండ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీపీఎస్ అంతమయ్యే వరకు ఉద్యమం

• ఆర్డీవో కార్యాలయం ఎదుట టీఎన్జీవోల ధర్నా



ధర్నా చేస్తున్న టీఎన్జీవో నేతలు

మెదక్ అర్బన్: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అంతమయ్యే వరకు ఉద్యమిస్తామని టీఎన్జీవో జిల్లా కన్వీనర్ శ్యాంరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీఎన్జీవో భవన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లు పదవిలో ఉన్న ప్రజాప్రతినిధులకు జీవితాంతం పింఛన్ లభిస్తుందని, ఏళ్ల పాటు సేవలందించిన ఉద్యోగులకు మాత్రం సామాజిక భద్రత లేదన్నారు. సెప్టెంబర్ 1న మండల కార్యాలయాల్లో, కలెక్టరేట్ ఎదుట భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కో కన్వీనర్ భూపాల్‌రెడ్డి, ఉమ్మడిజిల్లా నీటి పారుదలశాఖ సంఘం అధ్యక్షుడు దొంత నరేందర్, హరిబాబు, ప్రభాకర్, శర్మ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసేంత వరకు పోరాటం

జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు ప్రసాద్

మెదక్ అర్బన్: కంట్రిబ్యూటరీ పెన్షన్‌విధానాన్ని రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు రాములు, మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు జలగం ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మానవసేవయే మాధవసేవ

• వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ రాజేందర్

మెదక్ అర్బన్: మానవసేవయే.. మాధవసేవ అని విస్తృతమైన సేవలు అందించడంలో వాసవీ క్లబ్ ముందుంటుందని ఆ క్లబ్ వి105ఏ జిల్లా గవర్నర్ వంకమామిడి రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం మెదక్‌లోని జీకేఆర్‌గార్డెన్‌లో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహానికి స్టీల్ సామగ్రిని, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు నోట్‌పుస్తకాలు, నిరుపేదలకు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ కార్యదర్శి రాజేశ్వర్‌రావు, కోశాధికారి పూర్ణచందర్‌రావు, డిప్యూటీ గవర్నర్ నేతి వేణుకుమార్, కుర్తివాడ రాజేందర్, బాలయ్య, ఉభయ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గంజి శ్రీనివాస్, రాగి వనజ పాల్గొన్నారు.



వసతి గృహానికి స్టీల్ సామగ్రిని అందజేస్తున్న జిల్లా గవర్నర్ రాజేందర్

ప్రారంభమైన వినాయక నిమజ్జనాలు



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

మెదక్ అర్బన్: మెదక్‌లో వినాయక నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. బుధవారం గీతా జూనియర్ కళాశాలలో నిమజ్జనోత్సవాలు విద్యార్థుల ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటూ ఊరేగింపుగా గణపతిని తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

హవేళీఘణపూర్‌లో

హవేళీఘణపూర్: బుధవారం మండల పరిధిలోని ఔరంగాబాద్ గ్రామంలో ఐదురోజుల పాటు వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, అనంతరం గ్రామంలోని పెద్దచెరువులో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మారాజు, వార్డు సభ్యులు భూపతి, రవి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సామూహిక సెలవు పోస్టర్ ఆవిష్కరణ

నిజాంపేట: నిజాంపేట మండలంలోని కల్వకుంట ప్రభుత్వ పాఠశాలలో టీఎస్‌సీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన సామూహిక సెలవు నిర్వహిస్తున్నట్లు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో జిల్లా కోశాధికారి నవీన్, జిల్లా జనరల్ సెక్రటరీ జాఖీర్, ఉపాధ్యాయ సంఘం నేతలు రవీందర్, హరిప్రకాశ్, శ్రీకాంత్, దీప్తి, రాజేశ్వరి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం సభ్యులు

'మెగా ప్లాంటేషన్ విజయవంతం'

చిన్నశంకరంపేట: మెగా ప్లాంటేషన్ విజయవంతమైనట్లు ఎంపీడీవో బాల తెలిపారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో లక్ష మొక్కలునాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరితహారంలో భాగంగా ఒకే రోజు లక్ష మొక్కలు నాటాలన్న సంకల్పంతో పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిదుల సహాయంతో మొక్కలు నాటామన్నారు. నాటిన మొక్కలను పెంచే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపావతి, ఈవోపీఆర్డీ కోటిలింగం, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'నాటిన మొక్కలను కాపాడాలి'



ఈత చెట్లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మెదక్ రూరల్: నాటిన ప్రతి మొక్కను కాపాడాలని మెదక్ ఎక్సైజ్‌సీఐ గోపాల్ పేర్కొన్నారు. హరితహారంలో భాగంగా బుధవారం మెదక్, హవేళి ఘణాపూర్ మండలాల్లో 13 వేల మొక్కలు పంపిణీ చేసి, నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తగ్గిపోతున్న ఈతవనాలను పెంచేందుకు ప్రభుత్వం హరితహారంలో ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ యాదగిరి, షఫీ, కానిస్టేబుల్‌లు ప్రభాకర్, మహేశ్‌లతో పాటు ఆయా గ్రామాల గౌడ సంఘం నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుబుక్స్‌ను పంపిణీ చేసిన 'లయన్స్'



నోటుబుక్కులు అందజేస్తున్న లయన్స్ ప్రతినిదులు

రామాయంపేట: పట్టణంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పేద విద్యార్థులకు లయన్స్‌క్లబ్ నోటు బుక్కులు పంపిణీ చేసింది. సేవాకార్యక్రమంలో భాగంగా బుధవారం సుమారు వందమంది పిల్లలకు వీటిని అందజేశారు. క్లబ్ చైర్మన్ వంజరి కైలాస్ నేతృత్వంలో కార్యదర్శి ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ దేమె యాదగిరి, సాంగని యాదగిరితో పాటు క్లబ్ సభ్యులుపాల్గొన్నారు.

సామూహిక సెలవు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



సామూహిక సెలవు పత్రాన్ని ప్రధానోపాధ్యాయుడికి ఇస్తున్న ఉపాధ్యాయులు

మెదక్ అర్బన్: నూతన పెన్షన్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని తలపెట్టిన సామూహిక సెలవు సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం ను జయప్రదం చేయాలని ఎస్టీయూ నాయకులు రాజ్‌గోపాల్‌గౌడ్, యాదవరెడ్డి, సిద్దిరాములు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గుల్షన్‌క్లబ్‌లో వారు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెదక్, హవేళీఘణపూర్, కొల్చారం, చిన్నశంకరంపేట మండల బాధ్యులు బాలకృష్ణ, అరుణ్, నాగరాజు, మహేష్, సాయిలు, ఇందు, వేణు తదితరులు పాల్గొన్నారు.

హవేళీఘణపూర్‌లో

హవేళీఘణపూర్: ఉపాధ్యాయ, ఉద్యోగులందరూ సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెట్టి మెదక్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని పీఆర్టీయూ హవేళీఘణపూర్ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రాజిపేట పాఠశాలలో ఉపాధ్యాయులందరూ సెప్టెంబర్ 1న సెలవు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయుడు సిద్ధిరాములుకు సెలవు మంజూరుపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, బాలకిషన్, అశోక్, రాంచందర్, ధన్‌రాజ్, బసూరొద్దీన్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

'మొక్కలను నాటితేనే మనిషికి మనుగడ'

శివ్వంపేట: మొక్కలను నాటితేనే మనిషికి మనుగడ ఉంటుందని ఎంపీడీవో కౌసల్యాదేవి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నగొట్టిముక్కల శివారులోని అటవీ ప్రాంతంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను నాటి వాటిని సంరక్షించడం వలన అవి పెరిగి కాపాడుతాయన్నారు. మొక్కలను నాటి సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించిన తహసీల్దార్

నర్సాపూర్‌రూరల్: మండలంలోని మూసాపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మంచిగా చదివి ఉన్నత పదవులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు, నాయకులు మల్లేశంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె ఆగదు'

నర్సాపూర్: ఐకేపీలో అరకొర వేతనంతో పనిచేస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను ఆపే ప్రసక్తి లేదని ఐకేపీ అకౌంటెంట్ల సంఘం నియోజకవర్గ కన్వీనర్ మల్లేశం పేర్కొన్నారు. కొన్ని రోజులుగా ఐకేపీలో పనిచేస్తున్న అకౌంటెంట్లు, అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. గతంలో ఆందోళన చేసిన సమయంలో ప్రభుత్వం పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు పట్టించుకోవడం లేదని దీంతో సమ్మె బాట పట్టకతప్పలేదన్నారు. ఇప్పటికైనా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మల్లేశం కోరారు. ఇదిలా ఉండగా గత వారం రోజులుగా ఐకేపీలోని అటెండర్లు, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మె చేస్తుండటంతో కార్యాలయంలో ఎవరూ అందుబాటులో లేక మహిళా సంఘాల సభ్యులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది.

'విద్యాభివృద్ధికి కృషి చేయాలి'

నర్సాపూర్‌రూరల్: మండలంలోని రుస్తుంపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జెమిని మాట్లాడుతూ విద్య అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ముత్యాలు, సత్యనారాయణ, సామ్యానాయక్, మోహన్‌రావు, శ్రీనివాస్‌నాయక్, మోహిజోద్దీన్, శ్రీనివాస్‌యాదవ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

నర్సాపూర్: వినాయక నవరాత్రుల సందర్భంగా బుధవారం నర్సాపూర్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు, ఆర్యవైశ్య సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాస్‌గుప్తా, సంఘం పట్టణ అధ్యక్షుడు పైడి శ్రీధర్‌గుప్తా, కార్యదర్శి జ్ఞానేశ్వర్, ప్రతినిధులు జె.వెంకటేశం, నేముల‌శ్రీను, ముక్కాలశ్రీనివాస్, ఆర్.వెంకటేశం, వీరేశం, రమేష్, ఈ.శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

'మోదీ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారు'

నర్సాపూర్: ప్రధాని మోదీ పాలనకు ఆకర్షితులై గ్రామీణ ప్రాంత యువత పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు 50మంది రమేష్‌గౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీఆర్ఎస్ పాలన పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల నాటికి నర్సాపూర్ నియోజకవర్గంలో కూడా బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతుందని రమేష్‌గౌడ్ పేర్కొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడిగా కృపాచారి

నర్సాపూర్‌రూరల్: మండల విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడిగా కె.కృపాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృపాచారి, ఉపాధ్యక్షులుగా రాంచంద్రయ్యచారి, బ్రహ్మయ్యచారి, ప్రధాన కార్యదర్శిగా నర్సింహాచారి, సహాయ కార్యదర్శిగా కమ్మరి లక్ష్మణ్ చారి, వడ్ల పద్మ, కోశాధికారిగా వడ్ల నర్సింహాచారి, ప్రధాన సలహాదారుడిగా కమ్మరి శ్రీనివాస్‌చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కృపాచారి మాట్లాడుతూ వారి అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

అధ్వానంగా తయారైన రోడ్లు


చిలప్‌చెడ్‌లో గుంతలమయంగా మారిన రోడ్డు


సీలాంపల్లి వద్ద బురదమయంగా మారిన రోడ్డు


చిలప్‌చెడ్‌లో గుంతలో కూరుకుపోయిన డీసీఎం వ్యాన్‌ను లాగుతున్న ఎక్సకవేటర్

చిలప్‌చెడ్: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రహదారులు రెండు, మూడు రోజులుగా కురిసిన వర్షాలకు బురద పేరుకుపోయి అధ్వానంగా తయారయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నర్సాపూర్-జోగిపేట ప్రధాన రహదారి కూడా చిత్తడిచిత్తడిగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా ఫైజాబాద్, సీలాంపల్లి, చిలప్‌చెడ్ గ్రామాల బస్టేజీల వద్ద రోడ్డు అధ్వాన్నంగా తయారయ్యాయి. గుంతలుగా మారిన రోడ్ల వల్ల ద్విచక్ర వాహనాలకు, ఆటోలకు తీవ్ర ఇబ్బందులు కల్గుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. బుధవారం సోమక్కపేట వద్ద మిషన్ భగీరథలో భాగంగా తీసిన గుంతలో డీసీఎం వ్యాన్ దిగపడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు స్థానికులు తెలిపారు. అనంతరం ఎక్సవేటర్ సహాయంతో బయటకు తీశారు. అదేవిధంగా మూడు రోజుల క్రితం చిలప్‌చెడ్ బస్టేజీ వద్ద లారీ, ఆర్టీసీ బస్సు గుంతల్లో దిగపడటంతో ఆ ప్రదేశమంతా ఇంకా గుంతలుగా బురదతో నిండిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని రోడ్లను బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య

కొల్చారం: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 1న తలపెట్టిన జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు పెన్షన్ విద్రోహదినంగా సెప్టెంబరు 1న పాటిస్తూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పెన్షన్ విధానం ఎంతో అవసరమని, పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

సెప్టెంబరు 1న ధర్నాలో పాల్గొనాలి

శివ్వంపేట: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహదినంగా పాటించాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు గంగాల రమేశ్, సుదర్శన్, శివకుమార్, రవికుమార్‌లు తెలిపారు. బుధవారం శివ్వంపేటలో వారు మాట్లాడుతూ సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహదినంగా పాటించి, సామూహికంగా ఉపాధ్యాయులందరు సెలవు పెట్టి జిల్లా కేంద్రాల్లో సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా నిర్వహించే నిరసన ర్యాలీలో ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. అదేవిధంగా దొంతి గ్రామంలో పెన్షన్ విద్రోహ దినం వాల్‌పోస్టర్‌ను ఉద్యోగ నాయకులు, ఉపాధ్యాయులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిబాబు, వేణుగోపాల్, ప్రకాష్, దుర్గారెడ్డి, దుర్గాప్రసాద్, పద్మజ, పద్మావతి, పద్మ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ కమిటీ ఏర్పాటు ఎన్నడో?


నల్లపోచమ్మ ఆలయం

కౌడిపల్లి: మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం నూతన కమిటీ ఎంపిక చేయడంలో జాప్యం ఏర్పడుతుంది. పాలకుల నిర్లక్ష్యం.. అలసత్వం కారణంగా నూతన కమిటీ ఏర్పాటు కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎండోమెంటు ఉన్నతాధికారులు ఆరు నెలల క్రితం సూక్ష్మస్థాయిలో నూతన కమిటీ సభ్యులపై విచారణ పూర్తి చేసినప్పటికీ పాలకవర్గాన్ని ప్రకటించడంలో అంతరాయం చేస్తున్నారు. ఇటీవలే చైర్మన్ పదవీ కోసం ఎండోమెంటు అధికారులు మండలంలో అన్ని గ్రామాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అయినప్పటికీ పాలక కమిటీని ప్రకటించకపోవడంతో ఆలయ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా మారింది. నల్లపోచమ్మ దేవాలయం ఎండోమెంటు పరిధిలోకి వచ్చి సంవత్సరం న్నర పూర్తవుతున్నా పాలక కమిటీ ఏర్పాటు చేయలేదు. 30ఏళ్లుగా తునికి గ్రామస్థుల ఐక్యమత్యంతో ముందుకు సాగిన ఆలయ అభివృద్ధి నేడు ఎండోమెంటు పరిధిలోకి రావడంతో అభివృద్ధి కుంటుపడుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తునికి గ్రామ శివారులో ఆలయం ఉన్నందున ఆ గ్రామానికి చెందిన వ్యక్తినే చైర్మన్ పదవీకి ఎంపిక చేయాల్సి ఉంటుందని ఎండోమెంటు అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకు తునికి గ్రామానికి చెందిన చెల్ల మల్లేశంను చైర్మన్‌గా గుర్తించి, ఏడుగురు డైరెక్టర్ల జాబితాను అధికారులు తయారు చేసి పాలకవర్గం నేతలకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఏడు మంది డైరెక్టర్లలో ఆలయ పూజారి శివప్ప (తునికి), ఆలయ ధర్మకర్త నారాయణరెడ్డి (తునికి), రమేశ్‌గుప్తా (తునికి), కల్హారి సంజీవ్ (రాయిలాపూర్), పాం ఉమారాణి (కొట్టాల), లింగంగౌడ్ (రాజిపేట్), కృష్ణాగౌడ్ (కౌడిపల్లి)ల పేర్లను డైరెక్టర్లుగా ఎంపిక చేసినట్లు తెలిసింది. స్థానికుల ఒత్తిడి కారణంగా నూతన కమిటీ ప్రకటించడంలో అధికార పార్టీ నేతలు వెనుకంజ వేస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా నల్లపోచమ్మ ఆలయం నూతన కమిటీ ప్రకటిస్తేనే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. ఆలయ కమిటీని ప్రకటించడంలో నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి శ్రద్ధ చూపాలని తునికి గ్రామస్థులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం అందక పస్తులు

- 18నెలలైనా అందని రేషన్
- పట్టించుకోని అధికారులు

కొల్చారం: రేషన్ బియ్యం అందక పేద ప్రజలు అల్లాడుతున్నారు. కొల్చారం మండలం ఎనగండ్ల గ్రామానికి చెందిన 32 పేద కుటుంబాలకు చెందిన వారు 18నెలల నుంచి బియ్యం లేక తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూలీ చేసుకొని దుకాణాల వద్ద కొనుగోలు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. రేషన్‌కార్డు రద్దు అయిందని అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 32కుటుంబాలకు రేషన్ బియ్యం రాకపోవడంతో అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడంపై ఆ గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులో ముగ్గురికి అంత్యోదయ కార్డులు ఉన్నాయి. గతంలో జిల్లా అధికారులకు విన్నవించినా, అలాగే తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించినా కూడా పట్టించుకోకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అధికారులు నీరుగారుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

ఆత్మకమిటీ చైర్మన్‌గా మల్లారెడ్డి

కొల్చారం: కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్, వెల్దుర్తి మండలాలకు ఆత్మకమిటీ చైర్మన్‌గా మండలంలోని పైతర గ్రామానికి చెందిన వై.మల్లారెడ్డిని ఎన్నుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆత్మకమిటీ చైర్మన్ మల్లారెడ్డి పేరు ఖరారు చేశారు. ఎన్నో సంవత్సరాల నుంచి పార్టీ కోసం క్రియాశీలకంగా పని చేసిన మల్లారెడ్డి పేరు ఖరారు కావడంతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొంది. నాల్గు మండలాలకు చెందిన 27 మంది డైరెక్టర్లు అందులో కొల్చారానికి 7మంది డైరెక్టర్లను ఖరారు చేయడం జరిగింది.

గణేష్ లడ్డు రూ.15వేలకు కైవసం

కౌడిపల్లి: మండల కేంద్రంలోని అభయ సీతారాముల ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ లడ్డును రూ.15,555లకు దక్కించుకున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా గణేష్ లడ్డును బహిరంగ వేలం పాటను నిర్వహించగా, కౌడిపల్లికి చెందిన రాజుగౌడ్ రూ. 15,555లకు వేలం పాడి గణేష్ లడ్డును కైవసం చేసుకున్నాడు.

సినిమాలు

వెంకటేశ్వర(తూప్రాన్)
నేనే రాజు నేనే మంత్రి

పావని(వెల్దుర్తి)
ఫిదా

వినాయక మండపం వద్ద అన్నదానం



ఎన్జీవో కాలనీ వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

చేగుంట: వినాయక నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ప్రతిరోజూ ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చేగుంటలోని ఎన్జీవో కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కాలనీ వాసుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా చేగుంట ఎంపీపీ అల్లి రమ హాజరై భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో కాలనీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, రాములు, విజయసేనారెడ్డి, రాంరెడ్డి, నరోత్తంరెడ్డి, రాంచంద్రం, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశుల నిమజ్జనాలు

● మండపాల వద్ద అన్నదానం

వెల్దుర్తి: గణేష్ నవరాత్రుల్లో భాగంగా వెల్దుర్తి మండల వ్యాప్తంగా గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 140 విగ్రహాలు ఏర్పాటు చేయగా కొందరు మండపాల నిర్వాహకులు మూడు రోజులకు గణనాథుల నిమజ్జనం చేయగా 5వ రోజు బుధవారం వెల్దుర్తి మండల కేంద్రంలో జ్యోతియూత్ క్లబ్ ఆధ్వర్యంలో గణనాథుల్ని భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. ట్రాక్టర్‌పై ప్రత్యేక అలంకరణ చేసారు. భజనలు, యువకుల నృత్యాల నడుమ ఊరేగింపు అనంతరం స్థానిక కుడి చెరువులో గణనాథుల్ని నిమజ్జనం చేశారు. బస్టాండ్ ఆవరణలో వ్యాపారులు ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక సంఘం సభ్యులు 300ల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రామాయపల్లిలో భారీగా ప్లాంటేషన్!

● హాజరైన తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి

మనోహరాబాద్ (తూప్రాన్): మనోహరాబాద్ మండలం రామాయపల్లి పంచాయతీలో బుధవారం హరితహారంలో చేపట్టిన భారీ ప్లాంటేషన్ కార్యక్రమానికి తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రామాయపల్లి వద్ద ఎవెన్యూ ప్లాంటేషన్‌ను, పాఠశాలలో హరితహారం నిర్వహించారు. ఆమ్లేట్ పరిధి పాలాట ఆటవీ ప్రాంతంలో ప్లాంటేషన్ చేపట్టగా, ఎలక్షన్‌రెడ్డి హాజరయ్యారు. ఇందులో జడ్పీటీసీ సుమనవిజయభాస్కర్‌రెడ్డి, సర్పంచు బాలమణి, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దారు నజీబ్ అహ్మద్, విజయభాస్కర్ రెడ్డి, పెంటాగౌడ్, పాండుగౌడ్ హాజరయ్యారు.

మండలంలో 1.21 లక్షల ప్లాంటేషన్..

మండలంలోని 9 గ్రామ పంచాయతీల్లో బుధవారం చేపట్టిన హరితహారంలో ఒకేరోజు 1.21 లక్షల మొక్కలను ప్లాంటేషన్ చేశారు.

వడియారంలో మరుగుదొడ్ల బిల్లు అందజేత

చేగుంట: వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నవారందరికీ బిల్లులు అందజేస్తున్నట్లు చేగుంట ఈవో బిక్షపతి తెలిపారు. మండల పరిధిలోని వడియారం గ్రామంలో వ్యక్తిగతమరుగుదొడ్లు నిర్మించుకున్నవారందిరికీ బుధవారం రూ.12 వేల చొప్పున చెక్కులు అందజేశారు.

మంచి ఫలితాలు సాధించాలి

● తూప్రాన్, కిష్టాపూర్ పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో సరోజినీదేవి



బాలికల హైస్కూలులో వంటకాలను పరిశీలిస్తున్న డీఈవో

తూప్రాన్‌రూరల్: పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని, ఇందుకోసం ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలుపట్టాలని జిల్లా విద్యాధికారి సరోజినిదేవి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచించారు. త్రీఆర్ఎస్ విధానం చక్కగా అమలయ్యేలా చూడాలన్నారు. బుధవారం తూప్రాన్‌లోని బాలుర, బాలికల హైస్కూళ్లను, కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. మొదట తూప్రాన్ బాలుర పాఠశాలలోకి వెళ్లి ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ఆరో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో తెలుగు పుస్తకం చదివించారు. పదో తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో హిందీ చదివించారు. పాఠశాలలో జరుగుతున్న కాంప్లక్స్ సమావేశంలో పాల్గొని త్రీఆర్ఎస్ పద్ధతి అమలవుతున్న తీరు, అందుకు అనుసరిస్తున్న విధానాల గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. కొత్త విధానంతో కచ్చితంగా మార్పులు కనిపించాలన్నారు. నీటివసతి, టాయ్‌లెట్ల సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలికల పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛభారత్ సెమినార్‌లో పాల్గొన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు.అక్కడి నుంచి కిష్టాపూర్ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్‌ను, మధ్యాహ్న బోజన వంటకాలను పరిశీలించారు. డీఈవో వెంట ఎంఈవో నర్సింలు కూడ ఉన్నారు. తూప్రాన్‌లో స్వచ్ఛభారత్, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ఉమ్మడి మండల స్థాయి సెమినార్ మొక్కుబడిగా జరిగింది. ఈ కార్యక్రమంలో తూప్రాన్, మనోహరబాద్ మండలాల్లోని 14ఉన్నత పాఠశాలల నుంచి తప్పనిసరిగా ఇద్దరేసి విద్యార్థుల చొప్పున సెమినార్‌లో పాల్గొనాల్సి ఉండగా కేవలం ఆరు పాఠశాలలే పాల్గొన్నాయి.

సీపీఎస్ అంతం కోసం ఉపాధ్యాయుల పంతం



బోనాల హెచ్‌ఎం సత్యనారాయణకు
వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు



నార్సింగి హెచ్‌ఎం కిషన్‌రెడ్డికి
వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

చేగుంట: సీపీఎస్ రద్దు ఉద్యోగుల పంథమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1 వ తేదీన ఉపాధ్యాయ ఉద్యోగులంతా సామూహిక సెలవుదినంగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నందున ఆ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ నాయకులు వినతిపత్రాలను అందజేశారు. మండల పరిధిలోని చందాయిపేట, బోనాల పాఠశాలల్లో జరుగుతున్న పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన ఉపాధ్యాయులు కాంప్లెక్స్ హెచ్ఎంలు లక్ష్మణ్, సత్యనారాయణలకు వేరువేరుగా వినతిపత్రాలు సమర్పించారు. సీపీఎస్ రద్దుచేసే వరకు తమ పోరాటం ఆగదని, సీపీఎస్ రద్దుకు సెప్టెంబర్1న సామూహిక సెలవులు పెడుతున్నందున ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకురావాలని విన్నవించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సిద్దయ్య, బద్రీనాథ్, గంగయ్య, రంగారెడ్డి, విఠల్ రెడి, రామకృష్ణతో పాటు వివిధ సంఘాల ఉపాధ్యాయ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్సింగిలో

నార్సింగి(చేగుంట): సీపీఎస్ రద్దుకోసం మండల కేంద్రమైన నార్సింగిలో ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. నార్సింగి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం జరిగిన కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ హెచ్‌ఎం కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాసు, అశోక్, శ్రీశైలం, తిరుపతితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న సామూహిక సెలవుగాపాటించండి

చేగుంట: ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సెప్టెంబర్ 1 వ తేదీ సామూహిక సెలవుదినం పాటిస్తున్నందున ప్రజలంతా సహకరించాలని పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్ కోరారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించకుండా సీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నందున దాన్ని వ్యతిరేకిస్తూ పాతపెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ సెప్టెంబర్ 1న ఉపాధ్యాయ ఉద్యోగులంతా సమూహిక సెలవు తీసుకుంటున్నందున ప్రజలంతా సహకరించాలని జిల్లాస్థాయి, అధికారులు కూడా ఈ విషయంలో తమ అభ్యర్థనను మన్నించాలని కోరారు.

నాచారంలో హుండీ ఆదాయం! రూ.13,89,254

తూప్రాన్: నాచారంగుట్ట లక్ష్మీనృసింహ్మా స్వామి ఆలయంలో ఈసారి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ సభ్యులు కొడిప్యాక వెంకటేశంగుప్త, వంజరి విఠల్, పల్లెమీది చంద్రారెడ్డిలు తెలిపారు. తూప్రాన్ విలేకరులతో మాట్లాడుతూ, బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారన్నారు. 100రోజులకుగానూ రూ.13 లక్షల 89వేల 254లు వచ్చినట్లు చెప్పారు. వీటితోపాటు రద్దయిన నోట్లు రూ. 17వేలు, వెండి, బంగారం, డాలర్లు ఉన్నట్లు తెలిపారు.

సమాజ సేవలో వాసవీక్లబ్ ముందంజ

● వాసవీ గవర్నర్ రాజేందర్



వెల్‌కంబోర్డును ప్రారంభిస్తున్న గవర్నర్ రాజేందర్

చేగుంట: పేద ప్రజలకు సేవ చేయడంలో వాసవీక్లబ్ ముందు వరుసలో ఉందని వాసవీక్లబ్ గవర్నర్ రాజేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన చేగుంటలోని వాసవీక్లబ్‌లో బుధవారం గవర్నర్ రాజేందర్ ఆకస్మికంగా పరిశీలించి, క్లబ్ చేస్తున్న సేవ కార్యక్రమాల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసవి, క్లబ్ ఏర్పాటు చేసిన వెల్‌కంబోర్డును ప్రారంభించారు. అనంతరం పేద ప్రజలకు బియ్యం, విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. వాసవి క్లబ్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సైతం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వాసవీ సభ్యులు సేవ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ చేగుంట అధ్యక్షుడు ఐతా పరంజ్యోతి, వనితా క్లబ్ అధ్యక్షురాలు సంధ్యారాణి, జోనల్ చైర్మన్ మంచికట్ల శ్రీనివాస్, విజయ్‌కుమార్, రాజేశ్వర్‌రావు, పూర్ణచందర్‌రావు, స్థానిక వాసవి సభ్యులు వేణు, నాగరాజు, రామలింగం, సుజాత, మంజూల తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సేవకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చేగుంట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గ్రామ సేవకుడి కుటుంబానికి రెవెన్యూ శాఖ తరపున ఆర్థిక సహాయాన్ని అందించారు. మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన చందు స్వామి మంగళవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందగా గ్రామ సేవకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నందున అతని కుటుంబానికి ప్రభుత్వం తరపున పదివేల రూపాయలను అంత్యక్రియల కోసం మంజూరు చేశారు. ఇట్టి డబ్బులను వీఆర్‌వో కిష్టయ్య స్వామి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేసి, అంత్యక్రియలు నిర్వహించుకోవాలని తెలియజేశారు.

మిషన్ భగీరథ భేష్

• మా రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలుచేస్తాం • 'మధ్యప్రదేశ్' ఇంజనీర్ల బృందం కితాబు

• కోమటిబండ సంపు, పెద్దారెడ్డిపేట నీటిశుద్ధి కేంద్రం పరిశీలన



పెద్దారెడ్డిపేట ఇన్‌టెక్ వెల్ నుంచి వచ్చే రా వాటర్ విధానాన్ని పరిశీలిస్తున్న ఇంజనీర్లు

పుల్‌కల్ : ప్రతి పల్లే తాగునీటి తాగునీటి అవసరాలను తీర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మిషన్ భగీరథ' పథకం అద్భుతంగా ఉందని మధ్యప్రదేశ్ ఇంజనీర్ల బృందం కితాబునిచ్చింది. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం పెద్దారెడ్డిపేట గ్రామ శివారులో మిషన్ భగీరథ పథకం కింద నిర్మిస్తున్న 'సంగారెడ్డి సెగ్మెంట్' నీటి శుద్ధి కేంద్రాన్ని మధ్యప్రదేశ్ ప్రభుత్వ 'జల్ నిగం' సీనియర్ ఇంజనీర్ ఏకే శ్రీవాస్తవ నేతృత్వంలోని తొమ్మిది మంది ఇంజనీర్ల బృందం బుధవారం పరిశీలించింది. మంజీర బ్యాక్ వాటర్‌లో నిర్మించిన ఇన్‌టెక్ వెల్‌ను వారు పరిశీలించారు. అనంతరం నీటిశుద్ధి కేంద్రంలో నిర్మించిన ఫిల్టర్ బెడ్స్, క్లారిఫ్యూక్లేటర్ 1, 2, ల్యాబ్స్, క్లోరినేషన్ గదులను సందర్శించారు. ఫిల్టర్ బెడ్ల దిగువ భాగంలో ఉపయోగించే ఇసుక, బొగ్గు, గులకరాళ్లు తదితర వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారని ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ విజయ్‌ప్రకాశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధ్యప్రదేశ్ జల్ నిగం సీనియర్ ఇంజనీర్ శ్రీవాస్తవ మాట్లాడారు. గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని కేవలం రెండేళ్ల వ్యవధిలోనే మిషన్ భగీరథ పేరుతో తాగునీటిని సరఫరా చేయడం చాలా బాగుందన్నారు. ఈ పథకం తమను ఎంతగానో ఆకట్టుకున్నదని తెలిపారు. పనుల నిర్వహణలో వేగం, నాణ్యత, ప్రమాణాలు కఠినతరంగా ఉన్నాయని కితాబునిచ్చారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎప్పటికప్పుడూ నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ లేకుండా పర్యవేక్షించడం అభినందనీయమన్నారు. దేశంలో సగటున ప్రతి మనిషికీ రోజుకు 55 లీటర్ల చొప్పున నీటి కేటాయింపులున్నాయని వెల్లడించారు. అయితే, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో దానిని వంద లీటర్లకు డిజైన్ చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించడం బేషుగ్గా ఉందన్నారు. రాను రాను తాగునీటితో పాటు మనిషికి ఇతర నీటి అవసరాలు కూడా అధికమవుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో మిషన్ భగీరథ పథకాన్ని సకాలంలో పూర్తి చేయడం గమనిస్తుంటే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల కృషికి నిదర్శనమన్నారు. ఇదే తరహాలో ఈ పథకాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనూ అమలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు లేదా వచ్చే ఏడాది జూన్ నాటికల్లా సమృద్ధిగా తాగునీటిని అందించనున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ విజయప్రకాశ్ వివరించారు. మధ్యప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇంజనీర్లు పీకే రఘువంశీ, పంకజ్ విజయ్‌వర్గీయ, జీపీ గనోటి, సంజయ్ వాద్వా, శ్యాంవర్మ, ప్రశాంత్ శర్మ, విశాల్ మెహ్రా, ప్రదీప్ సిన్హాలు అధ్యయన బృందంలో ఉన్నారు. కాగా, మునిపల్లి మండలంలోని బుసారెడ్డిపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని కూడా పరిశీలించారు. వారి వెంట మెదక్ సెగ్మెంట్ ఈఈ సురేష్, సంగారెడ్డి సెగ్మెంట్ ఈఈ రఘువీర్, జహీరాబాద్ డిప్యూటీ ఈఈ ప్రశాంత్ కుమార్, ఏఈఈ కృష్ణ, ఎల్‌అండ్‌టీ ప్లాంట్ హెడ్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.





లేబోరేటరీ పరికరాలను పరిశీలిస్తున్న ఇంజనీర్లు, పెద్దారెడ్డిపేటలో నీటిశుద్ధి కేంద్రం గురించి వివరిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ విజయ్‌ప్రకాశ్



కోమటి బండ పైలాన్ వద్ద బృందం

ఇంటింటికీ తాగునీటి పథకం అద్భుతం

గజ్వేల్: నల్లా ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించే మిషన్ భగీరథ పథకం భేష్ అని మధ్యప్రదేశ్ ఇంజనీర్ల బృందం సభ్యులు కితాబునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండలో సంపుహౌజ్‌ను మధ్యప్రదేశ్ ప్రభుత్వ 'జల్ నిగం' సీనియర్ ఇంజనీర్ ఏకే శ్రీవాస్తవ నేతృత్వంలో ఏకే శ్రీవాస్తవ, పీకే రఘువంశీ, పంకజ్ విజయ్‌వర్గీయాలతో కూడిన బృందం బుధవారం పరిశీలించింది. అనంతరం నల్లా ద్వారా నీటిని అందించే విధానాన్ని పరిశీలించేందుకు గిరిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నీటి సరఫరా విధానం, ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసే విధానాన్ని మిషన్ భగీరథ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లా ఎస్ఈ విజయ్‌ప్రకాశ్, గజ్వేల్ ఈఈ రాజయ్యలు వారికి క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ ఇంజనీర్ల బృందం మాట్లాడుతూ నల్లా ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించే పథకం ఆలోచన అద్భుతం అన్నారు. పరిశుద్ధమైన నీటిని ప్రజలకు అందించాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన విధానం గొప్పదన్నారు. ఏ గొప్ప కార్యక్రమమైనా ఎవరో ఒకరు మొదలు పెట్టాలని, ఇంటింటికీ నల్లా ద్వారా నీటిని అందించాలనే కార్యక్రమాన్ని తెలంగాణ సీఎం చేపట్టి, దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. తమ రాష్ట్రంలో సైతం ఇంటింటికీ నల్లా ద్వారా నీటిని అందించే విధానాన్ని త్వరలో అమల్లోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. నీరే మానవ జీవకోటికి ప్రాణాధారం అని, అలాంటి నీటిని ప్రతి ఇంటికీ అందిస్తున్న విధానం అద్భుతమన్నారు. వారి వెంట మిషన్ భగీరథ ఎస్ఈ విజయ్‌ప్రకాశ్, ఈఈ రాజయ్య, మధ్యప్రదేశ్ ఏఈలు జీపీ గానోటే, సంజయ్ వాధ్వా, శ్యాంవర్మ, ప్రశాంత్‌శర్మ, విశాల్‌మిశ్రా, ప్రదీప్‌మిశ్రా తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం

• న్యాక్ పీర్ టీం చైర్మన్ తనీజా

• హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

సిద్ధిపేట టౌన్ : సిద్దిపేట డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని న్యాక్ పీర్ టీం చైర్మన్ ప్రొఫెసర్ ఎన్‌కే.తనీజా అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో ఉన్న స్థితిగతులపై పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరించామని తెలిపారు. యూజీసీ (యూనీవర్సిటీ గ్రాంట్ కమిషన్)కి నివేదిక రూపంలో అందజేస్తామని చెప్పారు.పూర్వ విద్యార్థులు ఇచ్చినటువంటి ప్రతి సూచనను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. కళాశాల అభివృద్ధికి వారి తోడ్పాటు అభినందనీయమన్నారు.

పూర్వ విద్యార్థి ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ కళాశాల యూనివర్సిటీ స్థాయికి అభివృద్ధి చేయడానికి సహకారాన్ని అందించాలని న్యాక్ టీంను కోరారు. సాహితీ వేత్తలను, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, ప్రజాప్రతినిధులను, అధికారులను, మేధావులను అందించిన చరిత్ర కళాశాలదన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో తాము చదువుకున్న రోజులను మరువలేమని, ఇక్కడ చదువుకుని ఈ స్థాయిలో ఉన్నామని చెప్పారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు. కళాశాల పూర్వ విద్యార్థి సంఘం చైర్మన్ పాపయ్య మాట్లాడుతూ కళాశాల గొప్ప వ్యక్తులను అందించిందన్నారు. కళాశాల అభివృద్ధిలో తాము ముందుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ఈ కళాశాలలోనే మంచి నడవడికను, జ్ఞానాన్ని నేర్చుకున్నానని తెలిపారు. అధ్యాపకులు నేర్పిన క్రమశిక్షణతోనే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ కళాశాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. టీఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం మాట్లాడుతూ తన జన్మనిచ్చిన తల్లి తర్వాత అంతే గొప్ప స్థాయిలో కళాశాలను భావిస్తానని చెప్పారు. కళాశాల అభివృద్ధిలో ఎప్పుడు ముందుంటానని చెప్పారు. మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో కళాశాల మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ శ్రీరాములు, పద్మాదేవి, సురేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, డాక్టర్ రవిందర్‌రెడ్డి, శర్మ, హరికృష్ణ, గోపాలసుదర్శనం, డాక్టర్ రవిబాబు, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో ఉన్న రోజులను గుర్తు చేసుకుంటున్న ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్







సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, హాజరైన ప్రముఖులు, కళాశాల మిత్రులతో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

సిద్దిపేట డిగ్రీ కళాశాలను పరిశీలించిన న్యాక్ టీం

కళాశాల ఔన్నత్యాన్ని వివరించిన ప్రిన్సిపాల్

యూజీసీ న్యాక్ పీర్ టీం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం పరిశీలించారు. కళాశాల గ్రేడ్ నిర్ధారించడం కోసం యూజీసీ నాక్ పీర్ కమిటీ చైర్మన్, ఉత్తర ప్రదేశ్‌లోని చౌదరి చరణ్ సింగ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌కే.తనీజా, తమిళనాడులోని జయరాజ్ అన్నపకీయం మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నిర్మల సందర్శించారు. మొదటగా కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం నాక్ పీర్ టీంకు స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కళాశాల ఔన్నత్యాన్ని వివరించారు. తర్వాత కళాశాలలో వివిధ సబ్జెక్టు విభాగాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అధ్యాపకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయాన్ని విద్యార్థులు వినియోగించుకుంటున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని సందర్శించారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి చేస్తున్న కృషిని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కొక్కొండ ప్రభువు నాక్ పీర్ టీంకు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చె ందిన అధ్యాపకులు డాక్టర్ రమేశ్‌బాబు, అయోధ్యరెడ్డి, చెప్పెల హరినాథశర్మ, లైబ్రేరియన్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అరచేతిలో ప్రపంచం

- సమగ్ర సమాచారమంతా స్మార్ట్‌ఫోన్‌లో
- ఇంటర్నెట్ కేంద్రాల్లో వ్యాపారం ఢమాల్
- మూతపడుతున్న షాపులు

సిద్దిపేట కల్చరల్: పెద్ద నగరాల నుంచి చిన్న పట్టణాల వరకు యువతను కనెక్ట్ చేసిన అడ్డా సైబర్ కేఫ్. ఇంటర్నెట్ రాకతో ప్రపంచం చిన్నదిగా మారిపోయింది. ఎక్కడ ఏమి జరిగినా క్షణాల్లో తెలిసిపోతోంది. బ్యాంకుల నుంచి ప్రభుత్వ కార్యాలయాల వరకు అన్నీ ఆన్‌లైన్ కావడంతో ఏ పనికైనా ఇంటర్‌నెట్ కేంద్రాలతో అవసరమేర్పడింది. ప్లేన్ టికెట్స్ నుంచి సినిమా టికెట్స్ వరకు అన్ని ఇంటర్‌నెట్‌తో ముడిపడిపోయాయి. దీంతో యువతే కాకుండా సామాన్యులు సైతం తమ పనుల నిమిత్తం ఇంటర్‌నెట్ కేంద్రాలకు పరిగెత్తారు. ఏ సైబర్ కేఫ్‌ను చేసినా సందడిగా కనిపించేవి. కానీ ఇదంతా గతం ప్రస్తుతం ఇంటర్‌నెట్ కేంద్రాలు వెలవెలబోతున్నాయి. స్మార్ట్‌ఫోన్ల రూపంలో అరచేతిలోనే అన్నీ పనులను చేసుకుంటున్నారు. ఫలితంగా ఇంటర్నెట్ బ్రౌజింగ్ కేంద్రాలు కనుమరుగైపోతున్నాయి. వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో మూసివేస్తున్నారు.

కళతప్పిన ఇంటర్నెట్ కేంద్రాలు

సిద్దిపేట పట్టణంలో 20కి పైగా ఇంటర్నెట్ బ్రౌజింగ్ కేంద్రాలు ఉండేవి. నేడు స్మార్ట్‌ఫోన్‌ల హవా నడుస్తుండడంతో 14కు పైగా ఇంటర్నెట్ కేంద్రాలను మూసివేశారు. మిగతా కేంద్రాలు కూడా వినియోగదారులు రాకపోవడంతో వెలవెలబోతున్నాయి. వేరే దారి లేక తప్పనిసరిగా కొందరు వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగ నోటిఫికేషన్‌లు వచ్చినపుడు మాత్రమే ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. గతంలో ఉదయం నుంచి మొదలు రాత్రి వరకు వినియోగదారులతో కళకళలాడేవి. ప్రస్తుతం పలు టెలికం కంపెనీలు పోటీ పడి 2 జీ, 3 జీ, 4 జీ పేరుతో మొబైల్ డాటా ప్యాకేజీలు అందుబాటు ధరలోనే అందిస్తుడడంతో యువత, ఉద్యోగులు వారికి కావాల్సిన సమాచారాన్ని క్షణాల్లో పొందుతున్నారు. ఇంటర్నెట్ కేంద్రాలకు వెళ్లడమే మానేశారు. ఒక వేళ వెళ్లిన తమ మెయిల్ నుంచి ప్రింట్ తీసుకోవడానికి మాత్రమే వస్తున్నారు. మరికొందరు ఆన్‌లైన్ చెల్లింపులు ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్స్ కోసం వెళ్తున్న పరిస్థితి కనబడుతుంది.

స్మార్ట్‌ఫోన్‌తో అన్నీ అందుబాటులోకి

రోజు రోజుకు మారుతున్న సాంకేతికతతో పాటు స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరిగిపోతూనే ఉంది. డిగ్రీ, పీజీ, ఉన్నత చదువులు చదివే విద్యార్థుల నుంచి పాఠశాల విద్యార్థుల వరకు ఈ స్మార్ట్‌ఫోన్‌లను వినియోగిస్తున్నారు. చాట్ చేస్తూ, వాయిస్, వీడియో కాల్స్ చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా సమాజంలో జరుగుతున్న సమాచారంతో పాటు ఆన్‌లైన్ ద్వారా సినిమాలు, పాటలు, క్రీడలను వీక్షిస్తున్నారు. అంతేగాక నెట్ బ్యాంకింగ్, గ్యాస్ బుకింగ్, పేటీయం, అమెజాన్, ఫ్లిప్ కార్ట్, ఆన్‌లైన్‌లోనే టికెట్ల బుకింగ్ తదితర సదుపాయాలతో సౌకర్యాలను పొందుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చే అసైన్‌మెంట్‌ను కూడా సెల్ ఫోన్ ద్వారా గూగల్ సెర్చ్ చేసే స్థాయికి వచ్చారు.

మరో దారిలేక వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాం



15 సంవత్సరాల క్రితంతో పోల్చుకుంటే సాంకేతికంగా ఎంతో మార్పు వచ్చింది. గంట సేపు వినియోగదారుడు ఇంటర్నెట్ బ్రౌజింగ్ చేస్తే రూ.30 తీసుకునేవాళ్లం. నేడు రూ.15 ఉన్నా ఎవరు రావడం లేదు. గతంలో వన్ ఎంబీ స్పీడుతో పది కంప్యూటర్లకు షేర్ చేసేవాళ్లం. నేడు పది ఎంబీపీఎస్ ఇచ్చిన నెట్‌వేగం లేదంటున్నారు. గతంలో రోజుకు 80 మంది బ్రౌజింగ్‌కు వచ్చేవారు. నేడు 10 మంది కూడా రావడం లేదు. జియో వచ్చాక పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ వ్యాపారంలోనే 15 సంవత్సరాల పైగా ఉన్నాం. ఆన్‌లైన్‌లో ఆధార్ నమోదు, టీఎస్పీఎస్సీ, ఎంసెట్ తదితర నమోదు ప్రక్రియను కొనసాగిస్తూ షాపు ను నడుపుతున్నాం. నాడు రిజల్ట్ కోసం విద్యార్థులు గంటల తరబడి క్యూలో నిలబడి వేచి చూసేవాళ్లు. నేడు కనీసం ఒక్కరు కూడా రావడం లేదు.

స్మార్ట్‌ఫోన్‌తో ఎన్నో పనులు



స్మార్ట్‌ఫోన్‌లు వచ్చాక చాలా పనులు ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. ఉద్యోగ నోటిఫికేషన్లు, విద్యాపరంగా ఏమైనా అనుమానాలుంటే గూగుల్‌లో అనుమానాలను నివృత్తి చేసుకుంటున్నాం. అంతేగాక ఇంటిపన్ను, విద్యుత్ బిల్లు మొదలైనవి చెల్లిస్తున్నాం. ఆన్‌లైన్‌లో వివిధ వ స్తువులు కొనుగోలు చేస్తున్నాం. స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రావడంతో, ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్లే సమస్య తప్పింది.

ప్రవళిక, డిగ్రీ విద్యార్థిని, సిద్దిపేట





స్మార్ట్ ఫోన్‌లో ఇంటర్‌నెట్ వినియోగిస్తున్న యువతులు, సిద్దిపేట ఇంటర్‌నెట్ కేంద్రంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఫోన్..మినీ కంప్యూటర్



స్మార్ట్‌ఫోన్ మినీ కంప్యూటర్‌లా పనిచేయడం వల్ల ఆన్‌లైన్ సేవలన్నీ అరచేతిలో అందుతున్నాయి. గతంలో బంధువుల క్షేమ సమాచారాలు తెలుసుకోవాలంటే ఉత్తరాల ద్వారా తెలిసేది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో పలు యాప్‌ల ద్వారా నేరుగా మాట్లాడుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఎక్కడ చూసినా స్మార్ట్‌ఫోన్‌లోనే అన్ని సేవలు లభిస్తున్నాయి.

సౌందర్య, డిగ్రీ విద్యార్థిని, సిద్దిపేట



కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్మించే పాములపర్తి చెరువు

కొండపోచమ్మా..నీవే దిక్కు!

- బ్యాంకు రుణాలు చెల్లించని రైతులు
- పరిహారం తీసుకుని బ్యాంకు ముఖం చూడరు
- రూ.7.50 కోట్ల రుణాల రికవరీ అంతేనా ?
- తలలు పట్టుకున్న గ్రామీణ వికాస్ బ్యాంక్ అధికారులు

మర్కుక్ : కొండపోచమ్మ ప్రాజెక్టు కోసం భూముల సేకరణ చేపట్టడం బ్యాంకర్ల పాలిట శాపంగా మారింది. ఆయా గ్రామాల రైతులకు రుణాలు ఇచ్చిన బ్యాంకర్లు అవి ఎలా వసూలు చేసుకోవాలో తెలియక తల పట్టుకుంటున్నారు. భూములు పోయిన తర్వాత రైతుల రుణ బకాయిలు ఎలా రాబట్టుకోవాలని అర్థంకాని పరిస్థితిల్లో కొట్టుమిట్టాడుతున్నారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కుక్, ములుగు మండలాల్లో ప్రాజెక్ట్ ముంపు గ్రామాల పరిధిలో రైతులకు అప్పు ఇచ్చిన బ్యాంకుల అవస్థ ఇది.

కొండపోచమ్మ ప్రాజెక్ట్ కోసం మండలంలోని పాములపర్తి చెరువును ఎంపిక చేసుకున్నారు. ఇందులో ప్రధానంగా ములుగు మండలంలోని మామిడ్యాల, బైలింపూర్, తానేదార్‌పల్లి, తాండా, గ్రామాలతో సహా వ్యవసాయ భూములు కూడా ముంపునకు గురవుతున్నాయి. మర్కుక్ మండలంలోని పాములపర్తి, మర్కుక్ గ్రామాల్లోని వ్యవసాయ భూములు ముంపుకు గురవుతున్నాయి. అయితే ఈ గ్రామాలన్నీ గౌరారం గ్రామీణ వికాస్ బ్యాంక్ పరిధిలోకి వస్తాయి. బ్యాంకు ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడి రైతులకు, మహిళా సంఘాలకు, ఇతర స్వయం ఉపాధి పథకాలకు ఈ బ్యాంకు ద్వారానే లావాదేవీలు కొనసాగుతున్నాయి. మామిడ్యాల, బైలింపూర్, తానేదార్‌పల్లి, తాండా గ్రామాలకు సంబంధించిన 527 మంది ఖాతాదారులు ఉన్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.5.5కోట్ల రుణాలు రైతులకు అందజేశారు. అదే విధంగా పాములపర్తి, మర్కుక్ గ్రామాలకు సంబంధించి 582 రుణ ఖాతాలు ఉండగా రూ. 2.08 కోట్లు బకాయిలు ఉన్నాయి. సాధారణంగా పంట రుణాలు ఇచ్చే సందర్భంలో బ్యాంకర్లు పట్టాదార్ పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్‌లు, సెక్యూరిటీ పేరిట తమ వద్ద ఉంచుకొని రుణాలు ఇస్తుండడం సర్వసాధారణం. ఇదే విధంగా ముంపు రైతుల భూముల పాసుపుస్తకాలన్నీ బ్యాంకులలో ఉన్నాయి. అయితే ముంపు భూముల సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలనే ధోరణిలో రెవెన్యూ యంత్రాంగం ఆయా రైతుల భూములను బ్యాంకు రుణాలతో సంబంధం లేకుండా ఒక డ్రైవ్ మాదిరిగా చకచకా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఆయా రైతులకు పరిహారం చెక్కులను ఎకరానికి రూ.12 లక్షల చొప్పున అందజేశారు. చెక్కులు తీసుకున్న రైతులు తాము బకాయిలు ఉన్న బ్యాంకుల జోలికి వెళ్లకుండా ఇతర బ్యాంకులలో డిపాజిట్ చేస్తున్నారు. ఈ అంశమే బ్యాంకర్లను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. భూములు ప్రాజెక్ట్‌లో పోయి పరిహారం రైతుల చేతిలో పడితే తమ బ్యాంకులో రైతుల పేరిట ఉన్న దాదాపు ఏడున్నర కోట్ల రుణ బకాయిల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఏమీ పాలుపోని స్థితిలో బ్యాంకర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇక మాకు కొండపోచమ్మే దిక్కు అని అమ్మవారిపై భారం వేసి చూస్తున్నారు.

'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత ఎవరు?


ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. **'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)

2. **చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) చెన్‌లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్(ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్(డెన్మార్క్)

3. **పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియాన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్(స్పెయిన్)

4. **ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?**
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) ఏకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్సియానో(అమెరికా)

5. **ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?**
ఎ) హార్వీ బి) చార్లీ సి) కోర్సస్ డి) కార్లా

6. **భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?**
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్

7. **ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన 'నంగ్‌తాంగ్ తంపక్' గ్రామం ఏ రాష్ట్రంలోనిది?**
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అస్సాం డి) మణిపూర్

8. **తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?**
ఎ) కుప్వారా బి) కథువా సి) కార్గిల్ డి) రాజేరి

9. **అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?**
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్



10. **రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?**
ఎ) మై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా

11. **జాతీయ క్రీడా దినోత్సవం?**
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30

12. **ఇటీవల మరణించిన టోని డెబ్రమ్‌కి సంబంధించి సరైనది?**
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ

13. **101 ఏళ్ల వయసులో ఇటీవల మరణించిన రామనంద సేన్ గుప్తా ఎవరు?**
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత

14. **ఇటీవల భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని?**
ఎ) ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బి) పుష్పకుమార్ దహల్
సి) షేర్ బహదూర్ దేవ్‌బా డి) రాంభరణ్ యాదవ్

15. **ఫోర్బ్స్ పత్రిక-2017కి గాను ప్రకటించిన ఆసియాలో అత్యంత ధనవంతుల జాబితాలో తొలిస్థానం పొందింది?**
ఎ) ముకేశ్ అంబానీ బి) జాక్ మా
సి) తదాషి యనాయ్
డి) అల్ వలీద్ బిన్ తూల్

16. **దేశ చరిత్రలోనే తొలిసారి నేషనల్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని ఇటీవల ఏ నగరంలో స్థాపించారు?**
ఎ) ముంబై బి) న్యూఢిల్లీ
సి) బెంగళూరు డి) చెన్నై

17. **ఇన్ఫోసిస్ నూతన చైర్మన్?**
ఎ) విశాల్ సిక్కా బి) సంజయ్ భంగర్
సి) నందన్ నీలేకని డి) ఇంద్రానూయి

18. **'గోప్యత పరిమితులతో కూడిన ప్రాథమిక హక్కు'గా తొమ్మిది మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో లేనివారు?**
ఎ) జగదీష్‌సింగ్ ఖేహర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె.అగర్వాల్
బి) నారిమన్, ఎ.ఎం.సప్రే, డి.వై.చంద్రచూడ్
సి) మదన్.బి.లోకూర్, ఎన్.వి.రమణ, రణ్‌బీర్‌సింగ్
డి) ఎస్.కె.కౌల్, అబ్దుల్ నజీర్, చలమేశ్వర్

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

19. **ఇటీవల ఏ ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకను విధుల నుంచి తొలగించారు?**
ఎ) ఐసిజిఎస్ వరుణ బి) ఐసిజిఎస్ రాజధాని
సి) ఐసిజిఎస్ సామ్రాట్ డి) ఐసిజిఎస్ జిజాబాయి

20. **దేశంలో అంతర్గత రవాణా కోసం భారతీయ ఎయిర్‌లైనర్ 'విస్తారా'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్?**
ఎ) ఖతార్ ఎయిర్‌లైన్స్(ఖతార్)
బి) కొరెండన్ డచ్ ఎయిర్‌లైన్స్(నెదర్లాండ్)
సి) బ్లూబర్డ్ ఎయిర్‌వేస్(గ్రీస్)
డి) ఎయిర్ కోర్సికా(ఫ్రాన్స్)

21. **రైల్వే బోర్డు నూతన చైర్మన్?**
ఎ) సుధా మిశ్రా బి) అతులేష్ జిందాల్
సి) స్థుతి నారాయణ్ కాకరే డి) అశ్వని లోహాని

22. **ఒడిశా ప్రభుత్వం అందించే 'బిజూపట్నాయక్ అవార్డు ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్'ని 2016కి గాను పొందింది?**
ఎ) ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావు
బి) ప్రొఫెసర్ దిగంబర్ బెహెరా
సి) ప్రొఫెసర్ మన్నెల్లి లక్ష్మీకాంతం
డి) డాక్టర్ ఎ.మోహన్‌రావు

23. **తమిళనాడు నూతన ఉపముఖ్యమంత్రి?**
ఎ) టి.వి.దినకరన్ బి) ఒ.పన్నీర్ సెల్వం
సి) జయరామన్ డి) ముత్తుస్వామి

24. **కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన 'స్వస్థ్ బచ్చే స్వస్థ్ భారత్'ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎక్కడ ప్రారంభించాడు?**
ఎ) కొచ్చి(కేరళ) బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) పట్నా(బీహార్) డి) మజోలి(అస్సాం)

25. **ధర్మేంద్ర కుమార్ ఏ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు?**
ఎ) బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్ఎఫ్)
బి) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్)
సి) సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)
డి) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటిబిపి)

26. **ఇటీవల సైన్యంలో చేరిన LR-SAM క్షిపణి ప్రత్యేకతలు?**
ఎ) భారత్ - ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి
బి) ఉపరితలం నుంచి గగనతలం ప్రయోగిస్తారు
సి) 2017 ఆగస్టులో నేవీలో ప్రవేశపెట్టారు
డి) పైవన్నీ

27. **ఎలక్ట్రానిక్ వ్యర్థాలను(e-waste) పాఠశాలల నుంచి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించిన రాష్ట్రం?**
ఎ) కర్ణాటక బి) కేరళ సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్

28. **జన్యు పరివర్తన పంటలపై ఇటీవల సూచనలు చేసిన పార్లమెంటరీ కమిటీకి నేతృత్వం వహించింది?**
ఎ) రేణుకా చౌదరి బి) శంతను కుమార్
సి) ముకుల్ ముద్గల్
డి) టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్

29. **లింగ సమానత్వం కోసం 'జండర్' ప్రస్తావన లేకుండా పాస్‌పోర్టులు జారీ చేయాలని నిర్ణయించిన దేశం?**
ఎ) మెక్సికో బి) నెదర్లాండ్స్
సి) పోర్చుగల్ డి) కెనడా

30. **భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తొలి 'విదేశీభవన్'ను ఏ నగరంలో ప్రారంభించారు?**
ఎ) ముంబై బి) అహ్మదాబాద్
సి) చెన్నై డి) బెంగళూరు

31. **ఆర్మీ నియామకాల్లో స్వలింగ సంపర్కులకు నిషేధం విధిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ చేసిన దేశం?**
ఎ) ఐర్లాండ్ బి) నైజీరియా సి) ఫ్రాన్స్ డి) అమెరికా



32. **స్వలింగ సంపర్కుల కోసం తొలిసారిగా గురుగ్రాం (హర్యానా)లో నిర్వహించిన 'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత?**
ఎ) నటాషా బి) తొలాయ్
సి) రవీణ డి) లటిసియ

33. **ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ 2016 గణాంకాల ప్రకారం అతి తక్కువ పర్యాటకులు సందర్శించిన దేశం?**
ఎ) ఫిజి బి) నేరు సి) ఆఫ్ఘనిస్థాన్ డి) తువాలు

34. **2017 ఆగస్టు 31న నిర్వహించనున్న హిందూ మహాసముద్ర దేశాల సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న నగరం?**
ఎ) సింగపూర్ సిటీ బి) కొలంబో
సి) బ్యాంకాక్ డి) న్యూఢిల్లీ

35. **నేపాల్ - భారత్ మధ్య ఏ నదిపై వంతెన నిర్మాణానికి భారత్ ఆమోదం తెలిపింది?**
ఎ) మోచి నది బి) తముర్ నది
సి) అరుణ్ నది డి) కనకయ్ నది

36. **షాంఘై కేంద్రంగా బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన తొలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసింది?**
ఎ) ఫోర్టలెజా(బ్రెజిల్) బి) సోచి(రష్యా)
సి) హంగ్జౌ(చైనా)
డి) జొహన్నెస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)

37. **2017 ఆగస్టు 26న కేంద్రం ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను పూర్తిగా నిషేధించింది?**
ఎ) జపాన్ బి) దక్షిణాఫ్రికా
సి) దక్షిణ కొరియా డి) కజకిస్థాన్

38. **బెల్జియం గ్రాండ్‌ప్రి-2017 ఫార్ములావన్ విజేత?**
ఎ) సెబాస్టియన్ వెటెల్ బి) లూయిస్ హామిల్టన్
సి) డేనియల్ రికార్డో డి) నికో రోజ్‌బర్గ్

39. **'జాట్'లను ఒబిసి జాబితాలో చేర్చి ఇటీవల ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం?**
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్

40. **2017 అక్టోబరులో భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?**
ఎ) సూర్యకిరణ్ బి) యుద్ధ అభ్యాస్
సి) ఏకువీరన్ డి) వజ్ర

సమాధానాలు

1) సి	7) డి	13) బి	20) ఎ	27) బి	34) బి
2) డి	8) డి	14) సి	21) డి	28) ఎ	35) ఎ
3) బి	9) ఎ	15) బి	22) బి	29) డి	36) డి
4) ఎ	10) బి	16) బి	23) బి	30) ఎ	37) సి
5) ఎ	11) బి	17) సి	24) ఎ	31) డి	38) బి
6) బి	12) డి	18) సి	25) బి	32) ఎ	39) డి
		19) ఎ	26) డి	33) డి	40) బి

JOBS ఉద్యోగాలు

ఎఎస్ఆర్‌బి

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎఎస్ఆర్‌బి)- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సహకారంతో **స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, లోయర్ డివిజన్ క్లర్క్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టుల వారీ ఖాళీలు: స్టెనోగ్రాఫర్ 95, క్లర్క్ 78
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత + స్టెనోగ్రఫీ పరిజ్ఞానం + టైపింగ్ నాలెడ్జ్ ఉండాలి.
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టెనో అభ్యర్థులకు ప్రొఫెషనల్ ఎఫిషియెన్సీ టెస్ట్ కింద నిమిషానికి 80 పదాల వేగంతో 10 నిమిషాల డిక్టేషన్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఇంగ్లీష్ మేటర్‌ను 50 నిమిషాల్లో, హిందీ మేటర్‌ను 65 నిమిషాల్లో కంప్యూటర్‌మీద ట్రాన్‌స్క్రైబ్ చేయాలి. క్లర్క్ పోస్టుకు కంప్యూటర్ మీద నిముషానికి 35 ఇంగ్లీష్ పదాలు/ 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి.
అడ్మిషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడింగ్: అక్టోబరు 14
సిబిటి నిర్వహించే తేదీ: అక్టోబరు 29
దరఖాస్తు ఫీజు: రూ.200(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 25
వెబ్‌సైట్: www.asrb.org.in, www.icar.org.in

ఐఐఐటి

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఆఫీసర్ - ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + 10 నుంచి 12 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మన్‌కు ప్రాధాన్యం ఉంటుంది.
గర్ల్స్ & బోయ్స్ హాస్టల్ - కేర్ టేకర్స్ & సూపర్‌వైజర్స్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం + కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలి
ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ఫర్ గర్ల్స్
అర్హత: ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ + బాలికలకు స్పోర్ట్స్ & ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహించడంలో కనీసం 5 నుంచి 7 ఏళ్ల అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి
ఇమెయిల్: recruitment@iiits.in
వెబ్‌సైట్: www.iiits.ac.in

ఎన్‌టిపిసి

ఎన్‌టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్- **మెడికల్ కన్సల్టెంట్స్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
